సంపుటి : 18
సంచిక : 212
Vol : 18
Issue : 212

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 22 అక్టోబర్ 2026
Warangal, Thursday 22 October 2026

పేజీలు : 08
వెల రూ : 4-00


Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



హిమాలయాల్లో మాస్టర్‌ప్లాన్



- హిమాలయాల్లో మాస్టర్‌ప్లాన్...
- ఈ రహదారి భారత్‌కు కొండంత బలం...
- చైనా గుండెల్లో గుబులు...
- మంచుకొండల్లో వ్యూహాత్మక దూకుడు
- సరిహద్దుల్లో కనెక్టివిటీ విప్లవం
- సరిహద్దుల్లో భారత్ బిగించనున్న పట్టు

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తు.. కన్నుల ముందు భయంకరమైన మంచు కొండలు! శీతాకాలం వచ్చిందంటే చాలు, లడఖ్ లోని జన్స్‌కార్ లోయ వైపు వెళ్లడమంటే మృత్యువుతో చెలగాటమాడటమే. అలాంటి అత్యంత ప్రమాదకరమైన 'షింకున్ లా పాస్' పై భారత్ విజయం సాధించింది. హిమాలయాల్లో అత్యంత ఎత్తయిన ఈ పర్వత మార్గాన్ని చీల్చుకుంటూ సరికొత్త రోడ్డును నిర్మించి, చైనా సరిహద్దుల్లో మన శత్రువుల గుండెల్లో గుబులు రేపేలా మాస్టర్ ప్లాన్ అమలు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన రూ. 3,350 కోట్ల భారీ అభివృద్ధి ప్యాకేజీలో ఈ షింకున్ లా పాస్ రోడ్ ప్రాజెక్టే అత్యంత కీలకమైంది. ఇప్పటివరకు మంచు తుఫాన్ల వల్ల ఏటా ఆర్నెల్ల పాటు లడఖ్ ప్రాంతం దేశంలోని ఇతర ప్రాంతాలతో పూర్తిగా

(మిగతా 2లో...)

- పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే సమగ్ర అభివృద్ధి
- డిపార్ట్‌మెంట్‌లో అన్ని ఖాళీలు భర్తీ చేస్తాం
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం ప్రకటన
- అమరవీరులకిచ్చే పరిహారం భారీగా పెంపు

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :

శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ 2028 నాటికి భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రసంగించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రథమ లక్ష్యమని, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే పోలీస్ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఇప్పటికే పోలీసు శాఖలో 5,000 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామని వివరించారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా ఒకేసారి 112 మంది డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం అపూర్వమైన ఘట్టమని, మిగిలిన పోస్టులను

(మిగతా 2లో...)



కస్టమర్ల డేటా లీక్ నిజమే?

- ఎస్‌బీఐ సంచలన ప్రకటన!?
- రంగంలోకి సైబర్ టీమ్స్..!

పీపుల్స్‌డైరీ-ముంబై : దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ల డేటా లీక్ వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ మేరకు డార్క్ వెబ్‌లో బ్యాంకు ఖాతాదారులకు సంబంధించిన సమాచారం బయటపడినట్లు వచ్చిన హెచ్చరిక నేపథ్యంలో ఈ ఘటనపై ఎస్‌బీఐ అధికారికంగా స్పందించింది. బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లకు సమర్పించిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది.

అక్టోబర్ 16న తొలిసారి ఎస్బీఐకి చెందిన థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, ఇండియన్ కంప్యూటర్

(మిగతా 2లో...)

తుపాకీతో స్టేటస్ షో..

- గన్ లైసెన్స్.. దుర్వినియోగం!
- వేటగాళ్లుగా గన్ లైసెన్సీలు!
- హైదరాబాద్‌లో పెరుగుతున్న గన్‌కల్చర్‌తో గబులు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : ఆత్మరక్షణ పేరుతో గన్ లైసెన్సులు తీసుకుంటున్నారు.. కానీ అదే ఆయుధాలతో అడవుల్లో వన్యప్రాణుల వేటకు పాల్పడుతున్నారు. హైదరాబాద్‌లో కొందరి గన్ కల్చర్ ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. లైసెన్స్‌డ్ వెపన్స్ దుర్వినియోగ ఘటనలు వరుసగా బయటపడుతుండటంతో ఆయుధాల వినియోగంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మలక్‌పేటలో జింక మాంసాన్ని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రైఫిల్‌తో పాటు ఎనిమిది బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలో జింకలను వేటాడి, వాటి మాంసాన్ని హైదరాబాద్‌కు తీసుకొస్తుండగా నిందితులు పట్టుబడినట్లు వెలుగులోకి వచ్చింది. వ్యక్తిగత భద్రత కోసం అనుమతి పొందిన ఆయుధాన్ని వేటకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీంతో గన్ లైసెన్సుల మాటున సాగుతున్న వన్యప్రాణుల వేట వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారం రోజుల క్రితం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. కొందరు సంపన్న కుటుంబాలకు చెందిన యువకులు స్పోర్ట్స్ కోటా, ఆత్మరక్షణ

(మిగతా 2లో...)



ఎలుగుబంట్లపై లెక్కల వేట

- నాలుగు జాతులు.. ఐదేళ్ల సర్వేకు అడుగులు
- ఎలుగుబంట్ల గణనకు మహా కసరత్తు!
- దేశ చరిత్రలోనే తొలిసారి లెక్కలు


పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : భారత అడవుల్లో సంచరించే వివిధ రకాల వన్యప్రాణుల లెక్కలను తేల్చేందుకు అధికారులు ఎప్పుడూ ముందుంటారు. అయితే, తాజాగా దేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు రకాల ఎలుగుబంట్ల జాతుల సంఖ్యను కచ్చితంగా అంచనా వేసేందుకు డెహ్రాడూన్‌లోని ప్రసిద్ధ 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఒక బృహత్తర కార్యక్రమానికి సిద్ధమైంది. దేశంలోని రక్షిత అడవుల్లో మానవ-ఎలుగుబంటి సంఘర్షణలను తగ్గించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక సర్వే చేపట్టనున్నారు. అన్ని జాతుల ఎలుగుబంట్ల పూర్తి గణాంకాలు వెలుగులోకి రావడానికి సుమారు ఐదేళ్ల సమయం పట్టనుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. భారతదేశం జీవవైవిధ్యానికి నిలయం. ఇక్కడ మొత్తం నాలుగు రకాల ఎలుగుబంటి జాతులు జీవిస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ వంటి అత్యున్నత హిమాలయ ప్రాంతాల్లో 'హిమాలయన్ బ్రౌన్ బేర్'

(మిగతా 2లో...)

ప్రభుత్వానికి కాసుల పంట

- పండుగకు ముందే గల్లపెట్టె గలగల
- నాలుగు రోజుల్లో రూ.755 కోట్ల విక్రయాలు
- దసరా ముందు ఒక్కరోజే రూ.303.40 కోట్ల బిజినెస్
- గతేడాది రికార్డులు బద్దలు





రాష్ట్ర పక్షులకు విముక్తి

దసరా వేళ బోనులో పాలపిట్టలు..
హైదరాబాద్‌లో పక్షులతో వ్యాపారం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పక్షిగా గుర్తింపు పొందిన పాలపిట్టను దసరా రోజున చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం కొందరిలో ఉంది. అయితే ఈ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని పక్షులను పట్టుకుని బంధించడం, ఆలయాల వద్ద ప్రదర్శించడం, వాటి ద్వారా డబ్బులు సంపాదించడం వంటి చర్యలు జరుగుతున్నాయని పక్షి సంరక్షణ సంస్థలు గతంలోనూ ఆందోళన వ్యక్తం చేశాయి. తాజాగా హైదరాబాద్‌లో వెలుగుచూసిన ఘటనలు ఈ సమస్య

(మిగతా 2లో...)

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

(మొదటి పేజీ తరువాయి)

దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం చెల్లించే ఎక్స్‌గ్రేషియాను కూడా భారీగా పెంచుతున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు.

బాధ్యతలు నిర్వర్తిస్తూ అమరులైన హోంగార్డుల కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు చెప్పారు. ఇతర పోలీసు సిబ్బందికి అందించే ఎక్స్‌గ్రేషియాను సైతం పెంచారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 45 లక్షల నుంచి రూ. 1 కోటికి పెంపు చేశారు.

ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్ల పరిహారాన్ని రూ. 1.25 కోట్లకు పెంచారు. డీఎస్పీలు, అదనపు ఎస్పీలకు రూ. 1.50 కోట్లు, ఎస్పీలు, ఐపీఎస్ అధికారుల కుటుంబాలకు చెల్లించే పరిహారాన్ని రూ. 1 కోటి నుంచి ఏకంగా రూ. 2 కోట్లకు పెంచారు. ఈ ఆర్థిక సాయం అమరవీరుల త్యాగాలకు ప్రభుత్వం అందిస్తోన్న గౌరవమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పెంపునకు సంబంధించి తక్షణమే అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వేదికపై ఉన్న రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.

సమాజంలో ట్రాన్స్‌జెండర్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి వారిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తోన్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా హోంగార్డుల నుంచి డీజీపీ స్థాయి అధికారుల పిల్లల వరకు నాణ్యమైన చదువును అందించడానికి 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను నెలకొల్పామని వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూనే, పోలీసుల వైఖరి ఎల్లప్పుడూ మానవతా దృక్పథంతో కూడి ఉండాలని సీఎం సూచించారు. ఆహార కల్తీపై కఠినంగా వ్యవహరించేందుకు టీజీ సేఫ్, అత్యవసర సమయాల్లో తక్షణ రక్షణ కల్పించేందుకు స్పందన బృందాలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మహిళల భద్రత కోసమే కాకుండా సమాజంలో బాధ్యతను పెంచేందుకు షీ టీమ్స్, స్టాండ్ విత్ హర్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడంలో నిరంతరం శ్రమిస్తున్న 'ఈగిల్ ఫోర్స్' బృందాన్ని సీఎం ప్రత్యేకంగా అభినందించారు.



హిమాలయాల్లో మాస్టర్‌ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలు తెగిపోయేవి. కానీ, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నిర్మించిన 298 కిలోమీటర్ల 'నిమ్ము-పదుమ్-దార్చా' రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆ కష్టాలకు చెక్ పడింది. అత్యంత సవాలుతో కూడుకున్న ఈ షింకున్ లా పాస్ మార్గం వల్ల ఒకప్పుడు 12 గంటలు పట్టే సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు కేవలం 3 గంటల్లోనే పూర్తవుతుంది. శ్రీనగర్-లేహ్, మణాలి-లేహ్ మార్గాల తర్వాత లడఖ్‌కు ఇది మూడో ప్రత్యామ్నాయ కనెక్టివిటీ కారిడార్‌గా మారింది. ఎటువంటి వాతావరణంలోనైనా చైనా సరిహద్దులకు మన సైనిక బలగాలను, భారీ యుద్ధ ట్యాంకులను క్షణాల్లో తరలించడానికి ఈ రహదారి భారత్‌కు కొండంత బలాన్నిస్తోంది.

లడఖ్ అభివృద్ధి, రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చింది. రూ. 640 కోట్లతో లేహ్ విమానాశ్రయం వద్ద నిర్మించిన నూతన ప్యాసింజర్ టెర్మినల్ ద్వారా వార్షిక ప్రయాణికుల సామర్థ్యం 10 లక్షల నుంచి 35 లక్షలకు పెరిగి పర్యాటక రంగానికి ఊతమిస్తోంది. మరోవైపు 'అమృత్ హిమ్ సరోవర్' పథకం కింద 40 గ్రామాల్లో జలాశయాలను ఏర్పాటు చేసి తాగు, సాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపగా, వెనుకబడిన గ్రామాలకు నిరంతరాయ విద్యుత్ కోసం 9 మెగావాట్ల 'హను' హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రాజెక్ట్, కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లను అందుబాటులోకి తెచ్చారు. అలాగే లడఖ్ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు లేహ్‌లోని సింధు ఘాట్ వద్ద దేశంలోనే తొలిసారిగా 'పెట్రోగ్లిఫ్ కన్జర్వేషన్ పార్క్'ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ సరిహద్దు రక్షణను సుదృఢం చేయడంతో పాటు లడఖ్ ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతున్నాయి.

తుపాకీతో స్టేటస్ షో!

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో పొందిన అధునాతన ఆయుధాలతో షాద్‌నగర్ అటవీ ప్రాంతంలో జింకల వేటకు వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని పట్టుకోవడంతో లైసెన్స్‌డ్ గన్‌ల వినియోగంపై అనుమానాలు మరింత బలపడ్డాయి.

వేటకే పరిమితం కాకుండా.. వేడుకల్లోనూ ఆయుధాల ప్రదర్శన! హైదరాబాద్‌లోని పాతబస్తీ ప్రాంతంలో కొందరు తుపాకులను హోదాకు చిహ్నంగా భావిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల చాంద్రాయణగుట్టలో ఓ వ్యక్తి వివాహ బరాత్ సందర్భంగా లైసెన్స్‌డ్ వెపన్‌తో గాల్లో కాల్పులు జరపడం కలకలం సృష్టించింది. ప్రాణరక్షణ కోసం తీసుకున్న ఆయుధాన్ని బహిరంగ వేడుకలో కాల్పులకు ఉపయోగించడంపై పోలీసులు విచారణ చేపట్టారు. మరోవైపు హుస్సేనియాలంలో మాజీ ఆర్మీ అధికారి తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధంతో ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది. ఇలా ఒకచోట వన్యప్రాణుల వేటకు, మరోచోట దర్పం ప్రదర్శించేందుకు, ఇంకోచోట ప్రాణాలు తీసుకునేందుకు తుపాకులు వినియోగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆయుధాలకు అనుమతి ఉన్నంత మాత్రాన వాటిని ఇష్టానుసారంగా ఉపయోగించవచ్చా? అనే ప్రశ్నలు ఇప్పుడు సామాన్యుల్లోనూ తలెత్తుతున్నాయి.

వరుస ఘటనల నేపథ్యంలో లైసెన్స్‌డ్ వెపన్స్ దుర్వినియోగాన్ని అరికట్టడంపై చర్చ మొదలైంది. కొందరు వీకెండ్ హంటింగ్ పేరుతో ఫాంహౌస్‌లు, అటవీ ప్రాంతాలకు వెళ్లి జింకలు, నెమళ్లు, కుందేళ్ల వంటి వన్యప్రాణులను వేటాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించేందుకు సమగ్ర విచారణ, ఆధారాల పరిశీలన అవసరం. గన్ లైసెన్సుల జారీ ప్రక్రియతోపాటు, ఆయుధాల వినియోగంపై పర్యవేక్షణ ఎంత సమర్థంగా జరుగుతోందన్నది కీలకంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, అవసరమైన సందర్భాల్లో లైసెన్సుల రద్దుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. వన్యప్రాణుల వేట, బహిరంగ కాల్పులు, ఆయుధాల నిర్లక్ష్య వినియోగం వంటి ఘటనలను అడ్డుకోవాలంటే పోలీసుల నిఘా మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మొత్తానికి ఆత్మరక్షణ కోసం అనుమతి పొందిన తుపాకులు.. వేటకు, విలాస ప్రదర్శనకు వేదికలుగా మారకుండా చూడటమే అధికార యంత్రాంగం ముందున్న అసలైన సవాల్.

ఎలుగుబంట్లపై లెక్కల వేట...

(మొదటి పేజీ తరువాయి)

(గోధుమ ఎలుగుబంటి), 'ఆసియాటిక్ బ్లాక్ బేర్' (నల్ల ఎలుగుబంటి) ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఇక మన దేశంలోని పొడి అడవులు, ముళ్ల పొదలు, నేల ప్రాంతాల్లో 'సోమరి ఎలుగుబంటి విస్తృతంగా కనిపిస్తుంది. అలాగే ఎలుగుబంట్ల కుటుంబంలోనే అత్యంత చిన్నదైన 'సన్ బేర్' జాతి ఈశాన్య భారతదేశం, బంగ్లాదేశ్ సరిహద్దుల దట్టమైన అడవుల్లో అరుదుగా జీవిస్తోంది.

దేశవ్యాప్తంగా ఎలుగుబంట్లకు, మనుషులకు మధ్య ఘర్షణలు రోజురోజుకు ఆందోళనకరంగా మారుతున్నాయి. ముఖ్యంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో 'స్లాత్ బేర్' వల్ల మానవ సంచార ప్రాంతాల్లో సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. హిమాలయ ప్రాంతాల్లో గోధుమ, నల్ల ఎలుగుబంట్ల వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు లెక్కలేనన్ని ఉన్నాయి. అయితే, అత్యంత చిన్నదైన 'సన్ బేర్' జాతితో మాత్రం మనుషులకు ఎదురుపడే సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఈ ఘర్షణలకు గల అసలు కారణాలను విశ్లేషించి, వాటికి శాశ్వత పరిష్కారాలు కనుగొనేందుకే ఈ భారీ సర్వే దోహదపడనుంది.

ఈ ఎలుగుబంట్ల సర్వే కేవలం ఒక్క ఏడాదిలో ముగిసేది కాదని, దీనికోసం సుమారు ఐదేళ్ల సమయం పడుతుందని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. మొదటగా స్లాత్ ఎలుగుబంట్ల సమస్యలపై దృష్టి సారించి, ఆ తర్వాత మిగతా మూడు జాతులపై ప్రత్యేక ప్రతిపాదనలను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో పరిశోధనలు జరుపుతారు. ఈ శాస్త్రీయ అధ్యయనం ద్వారా ఎలుగుబంట్ల ఆవాసాలను రక్షించడంతోపాటు, అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించనున్నారు.

కస్టమర్ల డేటా లీక్ నిజమే?

(మొదటి పేజీ తరువాయి)

ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ నుంచి హెచ్చరిక అందింది. డార్క్ వెబ్‌లో బ్యాంకు ఖాతాదారుల డేటా బయటపడినట్లు ఆ హెచ్చరికలో పేర్కొన్నారు. డార్క్ వెబ్‌లో అందుబాటులో ఉన్న సుమారు 3,75,000 రికార్డులను పరిశీలించగా, వాటిలో 3,897 ఖాతాదారులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారంతో కూడిన రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారంలో ఖాతాదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లు, పేర్లు, ఇమెయిల్ చిరునామాలు, నివాస చిరునామాలు, బ్రాంచ్ వివరాలు, సీఐఎఫ్ గుర్తింపు నంబర్లు, లీడ్ ఐడీలు, రుణాలు లేదా లీజుకు సంబంధించిన రికార్డులు, ఇతర సంబంధిత వివరాలు ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది.

ఈ నేపథ్యంలో ఎస్బీఐ తక్షణ చర్యలకు దిగింది. లీక్ అయిన డేటా ప్రామాణికత, సంపూర్ణతను నిర్ధారించడంతో పాటు, సమాచారం ఎక్కడి నుంచి బయటపడింది, ఎంత మేరకు ప్రభావితమైంది అనే అంశాలను తెలుసుకోవడానికి సమగ్ర దర్యాప్తు అవసరమని ఎస్బీఐ చెబుతోంది. ఖాతాదారులకు, బ్యాంకుకు ఎదురయ్యే ప్రమాదాలను అంచనా వేసే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. ఈ ఘటనపై బ్యాంకు సైబర్ భద్రతా చర్యలను వెంటనే అమలు చేసి, సమస్యను నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. అలాగే, స్వతంత్ర జజు=ు-×అ గుర్తింపు పొందిన సైబర్ భద్రతా సంస్థను నియమించి, ఈ ఆరోపణలకు సంబంధించిన సమాచార లీక్ స్వరూపం, పరిధిపై సమగ్ర పరిశీలన చేపట్టినట్లు తెలిపింది. అయితే ఈ లీక్ ఘటన వల్ల బ్యాంకు ప్రధాన కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు లేదా వ్యాపార కొనసాగింపుపై ప్రస్తుతం ఎలాంటి గణనీయమైన ప్రభావం లేదని ఎస్బీఐ తెలిపింది. బ్యాంకింగ్ సేవలు సాధారణంగానే కొనసాగుతున్నట్లు పేర్కొంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించే చర్యలను అమలు చేస్తున్నామని తెలిపింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని బ్యాంకు భరోసా ఇచ్చింది.



ప్రభుత్వానికి కాసుల పంట...

- పండుగకు ముందే గల్లపెట్టె గలగల
- నాలుగు రోజుల్లో రూ.755 కోట్ల విక్రయాలు
- దసరా ముందు ఒక్కరోజే రూ.303.40 కోట్ల బిజినెస్
- గతేడాది రికార్డులు బద్దలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : దసరా పండుగ తెలంగాణలో మద్యం వ్యాపారానికి భారీ ఊపునిచ్చింది. పండుగ సందడిలో మద్యం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పండుగకు ముందు నాలుగు పనిదినాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.755.14 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే పండుగ సమయంలో నమోదైన రూ.698 కోట్ల విక్రయాలను ఈసారి అధిగమించడం గమనార్హం. ముఖ్యంగా పండుగకు ముందు రోజైన అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల మద్యం విక్రయాలు జరగడం అమ్మకాల జోరుకు అద్దం పడుతోంది. అక్టోబర్ 14న రూ.102.17 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగగా, అక్టోబర్ 15న మద్యం డిపోలకు సెలవు కారణంగా సరఫరా కార్యకలాపాలు నిలిచాయి. అనంతరం అక్టోబర్ 16న రూ.126.32 కోట్లు, అక్టోబర్ 17న రూ.223.25 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. అక్టోబర్ 18న ఆదివారం సెలవు ప్రభావంతో అమ్మకాలు తగ్గగా, మరుసటి రోజు పండుగకు ముందు మద్యం కొనుగోళ్లు ఒక్కసారిగా పెరిగాయి. అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల వ్యాపారం జరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పండుగ నాలుగు రోజుల్లో మద్యం విక్రయాల్లో బీర్లు గణనీయమైన వాటాను దక్కించుకున్నాయి. ఈ వ్యవధిలో 10.44 లక్షల కేసుల బీరు అమ్ముడవగా, హార్డ్ లిక్కర్ విక్రయాలు 6.83 లక్షల కేసులుగా నమోదయ్యాయి. తెలంగాణలో బీరుకు ఉన్న ఆదరణ ఈ గణాంకాలతో మరోసారి స్పష్టమైంది. పండుగలు, సెలవుల సమయంలో వినియోగం పెరగడం మద్యం వ్యాపారానికి కలిసివచ్చింది.

అక్టోబర్‌లోనూ భారీ విక్రయాలు

నెలవారీ అమ్మకాలను పరిశీలిస్తే అక్టోబర్ 19 నాటికి రాష్ట్రంలో రూ.2,055 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత నెలలో రూ.3,209 కోట్ల అమ్మకాలు నమోదు కాగా, ఆగస్టులో రూ.3,482 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దసరా పండుగతో పాటు నెలాఖరు వరకు కొనసాగే విక్రయాల నేపథ్యంలో అక్టోబర్ నెల మొత్తం అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గతేడాది కంటే రూ.57 కోట్ల వృద్ధి

గత దసరా పండుగ సందర్భంగా నాలుగు రోజుల్లో రూ.698 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. ఈసారి అదే వ్యవధిలో విక్రయాలు రూ.755.14 కోట్లకు చేరాయి. అంటే గతేడాదితో పోలిస్తే రూ.57.14 కోట్ల మేర పెరిగాయి. పండుగ సీజన్‌లో మద్యం కొనుగోళ్లు పెరగడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు గణనీయమైన ఆదాయం సమకూరుతోంది.

2,620 వైన్ షాపులు.. 17 డిపోల నుంచి సరఫరా

రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్ షాపులతో పాటు సుమారు 1,200 బార్లు, రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న 17 మద్యం డిపోల నుంచి ఆయా విక్రయ కేంద్రాలకు సరఫరా అందుతోంది. ప్రభుత్వ ఆదాయ వనరుల్లో ఎక్సైజ్ శాఖకు కీలక స్థానం ఉంది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ తర్వాత అత్యధిక ఆదాయం సమకూర్చే శాఖల్లో ఎక్సైజ్ శాఖ ఒకటిగా నిలుస్తోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణలో మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో దసరా సీజన్‌లో నమోదైన భారీ అమ్మకాలు ప్రభుత్వ ఆదాయానికి మరింత ఊతమిచ్చాయి.

రాష్ట్ర పక్షులకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రతను మరోసారి గుర్తుచేస్తున్నాయి.

హైదరాబాద్ నగర పోలీసులకు అందిన సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. లంగర్‌హౌస్‌లోని బాపుఘాట్ సమీపంలో ఆలయం వద్ద ఇరుకైన బోనుల్లో ఉంచిన రెండు పాలపిట్టలను గుర్తించి విడిపించారు. అనంతరం వాటిని కేబీఆర్ పార్క్ అటవీ అధికారులకు అప్పగించారు. ఛత్రినాకలోని శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద చెట్టుకు బోను వేలాడదీసి బంధించిన మరో పాలపిట్టను పోలీసులు రక్షించారు.

మంగళహాట్‌లోని బాలాజీనగర్ గుడి సమీపంలో బోనులో ఉంచిన ఇంకో పాలపిట్టను కూడా విడిపించారు. ఈ రెండు పక్షులను సైతం అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలకు బాధ్యులైన వారిపై అటవీశాఖ సమన్వయంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఈ పాలపిట్టలను బంధించడంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు. "ఆకాశంలో స్వేచ్ఛగా ఎగరాల్సిన తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్టను దసరా వేళ కొందరు స్వార్థం కోసం ఇనుప బోనుల్లో బంధించారు. మూగజీవులను హింసిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని మేం ముందుగానే స్పష్టంగా హెచ్చరించినప్పటికీ.. కొందరు పెడచెవిన పెట్టి ఆ నిస్సహాయ పక్షులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అప్రమత్తమైన పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో హైదరాబాద్ సిటీ పోలీసులు తక్షణమే స్పందించి, మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు జరిపి మొత్తం 4 పాలపిట్టలను ప్రాణాలతో కాపాడారు" అని పేర్కొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

4వ బెటాలియన్‌లో ఘనంగా 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'

పీపుల్స్‌డైరీ-వరంగల్ : దేశ రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 4వ బెటాలియన్ పరిధిలో స్మృతి పరేడ్‌ను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై, అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న గత ఏడాది కాలంలో విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా అమరులైన పోలీసుల వివరాలను, వారి పేర్లను చదివి వినిపించారు. అనంతరం సిబ్బంది అమరుల గౌరవార్థం శోక్ శస్త్ర వందనం సమర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. కమాండెంట్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.... విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు బెటాలియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను కమాండెంట్ శ్రీనివాస్ రావు ప్రత్యేకంగా సత్కరించారు. వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుని, బెటాలియన్ తరపున అమరుల కుటుంబ సభ్యులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాజు, ఆర్ఐలు కార్తీక్, రాజ్ కుమార్, రాంప్రసాద్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు, రిటైర్డ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.





టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయాలు

- మాజీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌పై సస్పెన్షన్‌కు తీర్మానం
- భద్రాచలం ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని బాధ్యతల నుంచి తప్పించాలని తీర్మానం



పీపుల్స్‌డైరీ-కొత్తగూడెం : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, యూనియన్ క్రమశిక్షణ, సంఘ ఐక్యతే లక్ష్యంగా కొత్తగూడెం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా కార్యవర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. యూనియన్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్‌కుమార్ సభ్యత్వంపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయనను సస్పెండ్ చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరుతూ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. యూనియన్ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం స్పష్టం చేశారు.

మాజీ అధ్యక్షుడిపై చర్యలకు డిమాండ్.. కార్యదర్శి

జిల్లా అధ్యక్షుడిగా నాలుగేళ్లపాటు పనిచేసిన ఉదయ్‌కుమార్ ప్రస్తుతం యూనియన్ సభ్యుడిగా కొనసాగుతూ సంఘ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న అభ్యంతరాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి. జర్నలిస్టుల ఐక్యతకు విఘాతం కలిగించే చర్యలను అంగీకరించబోమని సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సభ్యత్వంపై సమీక్షించి, సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేశారు. రాష్ట్ర నాయకత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని జిల్లా కార్యదర్శి జునుమాల రమేష్ తెలిపారు.

ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులపై చర్యలకు తీర్మానం.. ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షులు

ఇటీవల భద్రాచలంలో చోటుచేసుకున్న ఘటనపై సమావేశం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి డిప్యూటీ తాసిల్దార్ ఆత్మహత్యకు కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ సభ్యులను విచారణ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా వారి బాధ్యతల నుంచి పక్కన పెట్టాలని రాష్ట్ర కమిటీని కోరుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నవీన్ వెల్లడించారు. ఘటనకు సంబంధించిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని యూనియన్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి సమావేశం ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇంటి స్థలాల కోసం పోరాటం


అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, ఇంటి స్థలాలు కేటాయించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని, హక్కుల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు చర్యలు తప్పవని నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బీవీ రమణారెడ్డి పేర్కొన్నారు. వ్యక్తుల కంటే సంఘ ప్రయోజనాలు, జర్నలిస్టుల ఐక్యత ముఖ్యమని, యూనియన్ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గిరిప్రసాద్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, డివిజన్ బాధ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

అంబరాన్ని అంటిన కోటమైసమ్మ జాతర సంబరాలు!

- కోటగుట్టపై అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..
- జాయింట్ వీల్స్, బొమ్మల దుకాణాలతో సందడిగా జాతర ప్రాంగణం
- పురాతన గుహలు, రాతి కట్టడాలు, బుంగబావిని వీక్షించేందుకు ఆసక్తి..
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు







సింగరేణి (కారేపల్లి), అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ):ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొలువుదీరిన కోట మైసమ్మ తల్లి దసరా జాతర సంబరాలు అంబరాన్నంటాయి. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ జాతరలో కోటగుట్టపై వెలసిన అమ్మవారి దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కోటగుట్టపై పురాతన ఆనవాళ్ల సందర్శన

ఈ ఏడాది జాతరకు ప్రత్యేకంగా కోటగుట్టపై వెలసిన కోట మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. కొండపై ఉన్న పురాతన గుహల ఆనవాళ్లు, రాతి కట్టడాలు, పవిత్రమైన బుంగబావిని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు గుట్టపైకి వెళ్తున్నారు. అమ్మవారి విశిష్టత, ఆలయ చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కుటుంబ సభ్యులతో జాతర సందడి

జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పిల్లల ఆటవస్తువుల దుకాణాలు, బొమ్మల కొట్లు, తినుబండారాల స్టాళ్లతో జాతర ప్రాంతమంతా సందడిగా మారింది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా జాతరలో పాల్గొంటున్నారు.కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. తమ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు సంప్రదాయాల ప్రకారం పోతురాజుకు యాటపోతులు, కోళ్లను సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. దేవస్థానం పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వంటావార్పు చేసుకుంటూ భోజనాలు, తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. రాత్రివేళ జాయింట్ వీల్స్ వద్ద సందడి చేస్తూ, పిల్లలతో కలిసి ఆటవస్తువులు కొనుగోలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు

జాతరకు భక్తుల రాక పెరగడంతో ప్రధాన రహదారులు రద్దీగా మారుతున్నాయి. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన పోలీసు యంత్రాంగం వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేసింది. గత వారం రోజులుగా పార్కింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించడంతోపాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతోంది.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీ మధ్య ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, కుటుంబ ఆనందాలు కలగలిసిన కోట మైసమ్మ తల్లి దసరా జాతర ఉత్సాహభరితంగా కొనసాగుతోంది.



జాతర రద్దీలో దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

- బంగారు ఆభరణాలు, పర్సులు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త
- భక్తులకు కారేపల్లి సీఐ నూనావత్ సాగర్, ఎస్సై బైరు గోపి సూచనలు

సింగరేణి (కారేపల్లి), అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ):సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని కోట మైసమ్మ తల్లి దసరా జాతరకు వచ్చే భక్తులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కారేపల్లి సీఐ నూనావత్ సాగర్, ఎస్సై బైరు గోపి సూచించారు. జాతర సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్, బంగారు ఆభరణాల చోరీ, పర్సులు, విలువైన వస్తువుల దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు.బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో బంగారు ఆభరణాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు మెడలోని బంగారు గొలుసులు,చిన్న పిల్లల మెడలో చైన్ లు,ఇతర ఆభరణాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో పర్సులు, మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు జాగ్రత్త!

కోట మైసమ్మ తల్లి జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లే సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లడం వల్ల దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. వీలైనంతవరకు ఇంటి వద్ద బాధ్యతగల వ్యక్తి ఉండేలా చూసుకోవాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి భద్రత విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చోరీలను నివారించవచ్చని పేర్కొన్నారు.



చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

జాతరలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో చిన్నపిల్లలు కుటుంబ సభ్యుల నుంచి విడిపోయే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు పిల్లలను ఎల్లప్పుడూ తమ వెంట ఉంచుకోవాలని పోలీసులు కోరారు. అనుకోని పరిస్థితుల్లో ఎవరైనా తప్పిపోతే వెంటనే జాతర ప్రాంగణంలోని పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బతుకుదెరువు కోసం వస్తే.. వలస కూలీపై దాడి!

- మాణిక్యారంలో 19 ఏళ్ల యువకుడికి తీవ్ర గాయాలు..
- మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు
- వలస కూలీపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి:
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

సింగరేణి (కారేపల్లి), అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ): బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి వలస వచ్చి కూలి పని చేసుకుంటున్న 19 ఏళ్ల యువకుడిపై దాడి జరిగిన ఘటన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాణిక్యారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. వలస కూలీపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.స్థానికుల కథనం ప్రకారం.. ఇతర రాష్ట్రం నుంచి ఉపాధి కోసం మాణిక్యారం ప్రాంతానికి వచ్చిన రాజు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రైతు భూక్య కోటయ్య అతనిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో రాజు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. దీంతో సహచర కూలీలు, స్థానికులు అతడిని కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు వివరాలు సేకరించి ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు వారు ఆరోపించారు. అనంతరం రాజు ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. గాయాల తీవ్రత దృష్ట్యా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కారేపల్లిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆటోలో తీసుకెళ్లాల్సి వచ్చిందని సమాచారం.



పాట్టకూటి కోసం వస్తే దాడి చేస్తారా?

వలస కూలీ రాజుపై జరిగిన దాడిని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు సుదూర ప్రాంతం నుంచి వచ్చి కూలి పని చేసుకుంటున్న యువకుడిపై దాడి చేయడం అమానుషమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘటనపై ఫిర్యాదు చేసేందుకు సహచర కూలీలు, స్థానికులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పటికీ కేసు నమోదు చేయలేదని, ఆరోపణలు ఎదుర్కొంటున్న రైతును స్టేషన్‌కు పిలిపించి విచారించలేదని బాధితుల తరఫున ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలను తీసుకొచ్చి వారి ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని తక్కువ కూలీతో అధికంగా పని చేయించుకోవడమే కాకుండా, భౌతిక దాడులకు పాల్పడటం తగదని నాగేశ్వరరావు అన్నారు. గతంలోనూ సంబంధిత రైతు వద్ద పని చేస్తున్న సమయంలో రాజుపై దాడి జరిగినట్లు తమకు సమాచారం ఉందని, ఆ తర్వాత అతను అక్కడ పని మానేసి మరో రైతు వద్దకు వెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తాజా ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

వైద్య ఖర్చులు భరించాలి

దాడి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై కేసు నమోదు చేయడంతో పాటు గాయపడిన రాజుకు మెరుగైన వైద్యం అందేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కొండబోయిన నాగేశ్వరరావు కోరారు. బాధితుడి వైద్య ఖర్చులను దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నుంచి చట్టప్రకారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో పేద కూలీలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ ఘటనను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సింగరేణి మండల అధ్యక్షుడు కేశగాని ఉపేందర్, మండల కార్యదర్శి యనమనగండ్ల రవి తదితరులు ఖండించారు. వలస కూలీలకు రక్షణ కల్పించి, బాధితుడికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

రేగొండలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

భూలక్ష్మి దేవతలకు ప్రత్యేక పూజలు..

రేగొండ అక్టోబర్ 21 పీపుల్స్ డైరీ.. : జయశంకర్ జిల్లా రేగొండ మండల కేంద్రంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ ఆచారాలు, ప్రత్యేక పూజలతో పండుగ సందడి నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



భూలక్ష్మి దేవతలకు ప్రత్యేక పూజలు.. ఆయుధ పూజలు

వేడుకల్లో భాగంగా భూలక్ష్మి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆయుధ పూజలు చేశారు. అనంతరం దసరా సంప్రదాయంలో భాగంగా సొరకాయ కొట్టి, గొర్రెపిల్లలను బలి ఇచ్చారు. గొర్రెపిల్లల నెత్తురుతో బొట్లు పెట్టుకుని రేగొండ ప్రజలు తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయ ఆచారాలను కొనసాగించారు. పలు ప్రాంతాల్లో బోనాలను సమర్పిస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. పద్మశాలి కుల పెద్ద, నామాల రమేష్, ఇంటి నుండి కంకణాలు తీసుకు వచ్చి గ్రామానికి చెందిన ప్రతి ఒక్కరికి కంకణ దారన చేశారు.అనంతరం జమ్మి చెట్టు వద్దకు చేరుకొని జమ్మి పూజలు చేశారు..విజయదశమి వేడుకల్లో భాగంగా రేగొండ పట్టణంలోని అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపుతో పట్టణంలోని వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర, నిమజ్జనం

రేగొండ అక్టోబర్ 21 పీపుల్స్ డైరీ : దేవి శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గాదేవి, మాతల విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామంలో రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు శోభాయాత్ర నిర్వహించి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వారు దుర్గమాత, విగ్రహాలను అందంగా అలంకరించి గ్రామంలో శోభా యాత్ర నిర్వహించారు. మహిళలు, యువతులు నృత్యాలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీదుల గుండా భాజ భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళ హరతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రేగొండ పోలీసుల ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ గ్రామ సర్పంచ్ ముడుతనపల్లి కుమార్, మొట్టే శ్రీనివాస్,బండారి దేవేందర్, ముడుతన పల్లి శంకర్,మద్ది శంకర్,పంచగిరి రవి,మేడిపెల్లి రవి,గాజుల మొగిలి.సయ్యద్ గాలిఫ్,సర్వ్ కుమార స్వామి,గ్రామస్తులు పాల్గొన్నారు..





ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత మందుల పంపిణీ

- అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి
- అమెరికా డాక్టర్ నేరెళ్ల దామోదర్

జమ్మికుంట అక్టోబర్ 21 పీపుల్స్ డైరీ. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని దుర్గామాత అమ్మవారి సన్నిధిలో శివాలయం దగ్గర చిన్నపిల్లలకు ఉచిత మందుల పంపిణీ కార్యక్రమంనిర్వహించారుఅమెరికా డాక్టర్ నేరెళ్ల దామోదర్ చేతుల మీదుగా చిన్నపిల్లలకు (0-16) సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మడిపల్లి గ్రామంలో గతంలో కూడా పెద్ద ఎత్తున







అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులచే అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఎంత ఎత్తుకు ఎదిగిన మూలాలు మర్చిపోకుండా పుట్టిన ఊరు పై ఉన్న మమకారంతో అమెరికా నుండి వచ్చి చిన్న పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వేద పండితులు రాజగోపాల్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారికి అర్చనలు ప్రత్యేక పూజలు చేశారుఈ సందర్భంగా డాక్టర్ నేరెళ్ల దామోదర్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన ఊరుని ఎప్పుడూ మరిచిపోనని గ్రామానికి వైద్య పరంగా కానీ ఏ ఇతర మౌలిక అవసరాలకు గాని తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు దుర్గామాత ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పాడి పంటలతో సిరి సంపదలు కలగాలని ప్రార్థించారుభక్తి భావంతో నిర్వహించిన పూజలతో అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పోషిని సత్యనారాయణ శ్రీ దుర్గ భవాని అసోసియేషన్ సభ్యులు భవాని స్వాములు,భక్తులు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ భాగోతం!

విలేకరుల పేరుతో బాటిళ్లు వసూలు...

- ఒక్కో వైన్స్ నుంచి 12 చొప్పున తీసుకున్నట్టు ఆరోపణలు
- తీరా పంపిణీలో వివక్ష..
- తనిఖీల పేరుతో హడావుడి..
- బెల్టు షాపులపై చర్యలు ఏవీ?
- 14 వైన్స్‌లు.. 3 బార్లు.. గల్లీకో బెల్టు షాపు ఆరోపణలు!
- ఎక్సైజ్ తీరుపై తీవ్ర విమర్శలు
- ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలి...

జమ్మికుంట, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : మద్యం అక్రమ విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖపైనే ఆరోపణలు వెల్లువెత్తడం కలకలం రేపుతోంది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలో మద్యం దుకాణాల తనిఖీల పేరుతో ఏం తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగకమానదు. విలేకరుల పేర్లు చెప్పి వైన్స్‌ల నుంచి మద్యం బాటిళ్లు సేకరించాల్సిన అవసరం ఏమొచ్చింది? సేకరించిన బాటిళ్లను అందరికీ ఇవ్వకుండా కొంతమందికే పంపిణీ చేశారనే ఆరోపణల వెనుక అసలు కథ ఏమిటి? మరోవైపు గ్రామాలు, పట్టణ వీధుల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలపై అధికారులు ఎందుకు సమర్థవంతంగా స్పందించడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

17 మద్యం దుకాణాలు.. బాటిళ్ల సేకరణపై ఆరోపణలు!


జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పరిధిలో 14 వైన్స్‌లు, మూడు బార్లు కలిపి మొత్తం 17 మద్యం దుకాణాలు ఉన్నట్లు సమాచారం. ఈ దుకాణాల్లో ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లు తనిఖీలు నిర్వహించే క్రమంలో ఒక్కో వైన్స్ నుంచి 12 బాటిళ్ల చొప్పున విలేకరుల పేరుతో సేకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీడియా ప్రతినిధులకు అందజేయాలనే ఉద్దేశంతో బాటిళ్లు ఇవ్వాలని నిర్వాహకులకు చెప్పినట్లు సమాచారం.

అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలైంది. బాటిళ్లు ఎవరి ఆదేశాల మేరకు సేకరించారు? ఎన్ని బాటిళ్లు సేకరించారు? వాటిని ఎవరెవరికి అందజేశారు? పంపిణీకి ఏమైనా అధికారిక అనుమతులు ఉన్నాయా? సంబంధిత వివరాలు ఏవైనా నమోదు చేశారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. సేకరించిన బాటిళ్లలో కొంతమందికే ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వకుండా వ్యవహరించారనే ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి.

ప్రశ్నిస్తే యూనియన్ల పేరు చెప్పి తప్పించుకుంటారా?

విలేకరుల పేరుతో బాటిళ్లు సేకరించి కొందరికే పంపిణీ చేశారనే అంశంపై ప్రశ్నించగా, యూనియన్ల పేర్లు ప్రస్తావిస్తూ సమాధానం దాటవేసే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఈ వ్యవహారానికి యూనియన్లకు సంబంధం ఏమిటి? ఏ యూనియన్ ఆదేశాలిచ్చింది? ఎవరు జాబితా తయారు చేశారు? బాటిళ్ల పంపిణీకి బాధ్యత వహించింది ఎవరు? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వ శాఖలో ఇలాంటి వ్యవహారం జరిగిందనే ఆరోపణలు రావడం ఆందోళనకరం. ఆరోపణలు నిజమైతే, వాటిపై విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. ఆరోపణలను ఖండించడం లేదా వివరణ ఇవ్వడం మాత్రమే కాకుండా, సేకరణ నుంచి పంపిణీ వరకు జరిగిన వ్యవహారంపై వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.



గల్లీకో బెల్టు షాపు.. అధికారుల దృష్టికి రావడం లేదా?

మరోవైపు బెల్టు షాపుల వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. వైన్స్‌లు, బార్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖకు, అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్టు షాపులు ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

జమ్మికుంట పరిధిలో ఎన్ని బెల్టు షాపులు ఉన్నాయి? వాటిని ఎవరు నిర్వహిస్తున్నారు? ఎక్కడి నుంచి మద్యం సరఫరా అవుతోంది? అనుమతులు లేని చోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? వాటిపై ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

తనిఖీల సమయంలో పెద్ద పెద్ద దుకాణాల వద్దకు వెళ్లడం మాత్రమే సరిపోదు. అక్రమ విక్రయాలపై నిర్దిష్ట సమాచారం ఉన్నప్పుడు వాటిని పరిశీలించి, ఆధారాలు లభిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. లేకపోతే తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలకు అవకాశం కలుగుతుంది.

గాంధీ జయంతి రోజున మద్యం లభించిందంటూ ఫిర్యాదు!

గాంధీ జయంతి రోజున ఒక బెల్టు షాపులో మద్యం లభించినట్లు ఆధారాలతో ఫిర్యాదు సమర్పించినప్పటికీ ఆశించిన చర్యలు కనిపించలేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఆ ఫిర్యాదుపై అధికారులు ఏం చేశారు? క్షేత్రస్థాయిలో విచారణ జరిపారా? మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? అక్రమ విక్రయాలు జరిగినట్లు నిర్ధారణ అయిందా? ఫిర్యాదుపై తీసుకున్న చర్యలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ఫిర్యాదు అందినప్పుడు దానిని పరిశీలించి వాస్తవాలను నిర్ధారించడం అధికారుల బాధ్యత. ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు చెబుతున్న నేపథ్యంలో వాటిని పరిశీలించకుండా వదిలేశారనే భావన కలగకుండా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోతే ప్రజలు అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం సహజమే.

మామూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?

ఎక్సైజ్ శాఖ అధికారుల వ్యవహారశైలిపై స్థానికంగా అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. మామూళ్ల కారణంగానే బెల్టు షాపులపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిర్ధారణ కావాల్సి ఉంది. వాటిని తేల్చేందుకు స్వతంత్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి!

ఎక్సైజ్ శాఖ అనేది మద్యం విక్రయాల నియంత్రణ, అక్రమ మద్యం విక్రయాల నిరోధానికి బాధ్యత వహించే విభాగం. అలాంటి శాఖపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని తేలికగా తీసుకోకుండా విచారణ జరపాలి. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లోని మద్యం దుకాణాల తనిఖీల వివరాలు, బెల్టు షాపులపై నమోదైన ఫిర్యాదులు, తీసుకున్న చర్యల వివరాలను జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకవైపు మద్యం బాటిళ్ల సేకరణపై ఆరోపణలు.. మరోవైపు బెల్టు షాపులపై చర్యల విషయంలో ప్రశ్నలు.. ఇంకోవైపు ఫిర్యాదులపై స్పందన లేదనే విమర్శలు.. ఈ పరిణామాలన్నింటిపై సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు ప్రతి ప్రశ్నకు పారదర్శకంగా సమాధానం చెప్పాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అవాస్తవాలైతే ఆధారాలతో ఖండించాలి. అంతేగానీ మౌనం వహించడం వల్ల అనుమానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

ముఖ్యంగా విలేకరుల పేరుతో బాటిళ్లు సేకరించారనే ఆరోపణలపై నిజానిజాలను ఎప్పుడు వెల్లడిస్తుంది? జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకుంటారా? అనేది వేచిచూడాల్సిందే.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

జాన్ విల్సన్ సేవలు చిరస్మరణీయం

హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వర్గీయ సీఐ యాదగిరి, ఎస్సై జాన్ విల్సన్ చిత్రపటాలకు పోలీసు సిబ్బంది, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వర్గీయ ఎస్సై జాన్ విల్సన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ





సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ.. హుస్నాబాద్ ప్రాంతంలో ఎస్సైగా పనిచేసిన జాన్ విల్సన్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్సై పి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల రక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. జాన్ విల్సన్‌కు హుస్నాబాద్ ప్రాంతంలో ఉన్న అభిమానానికి ఆయన పేరిట కొనసాగుతున్న చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు, ఆటో స్టాండ్ కు వారి పేరును, ఇళ్లలో, దుకాణాల్లో ఏర్పాటు చేసిన చిత్రాలే నిదర్శనమన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలను పలువురు నాయకులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బోయిని ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి దామెర పద్మారావు, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, వైద్యం కిరణ్ ప్రసాద్, బొలిశెట్టి రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ జెడ్పిటిసి బీలో నాయక్, నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బొజ్జ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి రూ. 1.86 లక్షల ఆర్థిక సహాయం



వీణవంక అక్టోబర్ 22 (పీపుల్స్ డైరీ) : మండలం లోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ 01-07-2026 రోజున మరణించడంతో, అతని ముగ్గురు కూతుళ్ళకి, కుటుంబానికి అండగా నిలిచేందుకు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కలిసి చదువుకున్న మిత్రులతో పాటు సోషల్ మీడియా ద్వారా మానవతా దృక్పథంతో స్పందించిన దాతలందరూ కలిసి రూ. 1,86,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

కష్టకాలంలో తమ మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి, స్నేహబంధం విలువను చాటుకున్నారు. స్నేహం అంటే కలిసి చదువుకోవడం, కలిసి తిరగడం మాత్రమే కాదని, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహమని నిరూపించారు. సోషల్ మీడియా వాట్సాప్ స్టేటస్ ద్వారా స్పందించి పెద్ద మనస్సుతో సహాయసహకారాలు అందించి మిత్రుడి కుంటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

వంగరలో పోలీస్ అమరవీరుల దినోత్సవం

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు

భీమదేవరపల్లి, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందంజలో ఉంటామని వంగర ఎస్ఐ మెరుగు రాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఎస్సై మెరుగు రాజు మాట్లాడుతూ... ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్క పోలీస్ సిబ్బంది కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్ కూడలిలో సైబర్ నేరాలపై అవగాహన

అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వంగర గ్రామం అంబేద్కర్ కూడలి వద్ద గ్రామస్తులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ , బ్యాంకు ఖాతా వివరాలు, పిన్ నంబర్లు మరియు వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ షేర్ చేయకూడదని, అనుమానాస్పద లింకులు: సెల్ ఫోన్లకు వచ్చే తెలియని, మోసపూరిత లింకులను క్లిక్ చేయవదని, ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, తక్షణమే (మొదటి గంటలోనే) 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక పుర‌ప్రముఖులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లిని కలిసిన బుచ్చయ్య సీనియర్ నాయకులు



శంకరపట్నం అక్టోబర్ :21 పీపుల్స్ డైరీ : దసరా పండుగను పురస్కరించుకుని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎల్ఎండి క్యాంప్ ఆఫీస్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెలవేని బుచ్చయ్య మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, భాస్కర్, వీరయ్య పాల్గొన్నారు.

ముల్కనూర్‌లో రోడ్డు ప్రమాదం

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్ర గాయాలు

భీమదేవరపల్లి అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కొప్పూరు గ్రామానికి చెందిన సుంచు రాజేందర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పూరు గ్రామానికి చెందిన సుంచు రాజేందర్ బుధవారం సాయంత్రం ముల్కనూర్ నుంచి కొప్పూరు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ముల్కనూర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఆయన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాజేందర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...

కేసు నమోదు : ఎస్ఐ శేఖర్ రెడ్డి

శంకరపట్నం అక్టోబర్ : 21 పీపుల్స్ డైరీ : మండలం లోని లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి సంపత్ తండ్రి చంద్రయ్య వయసు 50, యొక్క కుమారుడైన చల్లూరి సాయి వరుణ్ వయసు 24 సంవత్సరాలు అను అ తడు పని నిమిత్తం మెట్ పల్లి గ్రామానికి TG 02A 5350 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై తేదీ 20-10-2026 రోజున వెళ్లి తిరిగి వస్తుండగా మెట్ పల్లి గ్రామ శివారులో మధ్యాహ్నం 1: 15 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న AP 21 TB 0999 నెంబర్ గల లారీ నడుపు డ్రైవర్ అతివేగంగా నడుపుకుంటూ వచ్చి బైకును ఢీకొట్టగా చెల్లూరు సాయి వరుణ్ అక్కడికక్కడే మరణించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.



సమ్మక్క సారక్క గుడి పై కప్పును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం

ఆళ్లపల్లి అక్టోబర్ 21(పీపుల్స్ డైరీ) మండల పరిధిలోని అనంతోగు గ్రామ పంచాయతీ శివారులో ఉన్న సమ్మక్క-సారక్క గుడిలో దారుణం జరిగింది. గుడి పైకప్పును గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి, లోపల ఉన్న అమ్మవార్ల విగ్రహాలను బయటకు తీసి నేలపై పడేశారు. స్థానికులు చెబుతున్న ప్రకారం.. బతుకమ్మ వేడుకల సందర్భంగా కొంతమంది మధ్య గొడవ జరిగింది. ఆ గొడవలో ఒక వ్యక్తి తమపై దాడి చేశాడని, అదే కోపంతో అతనే ఈ గుడి పైకప్పును పగలగొట్టి, విగ్రహాలను బయట పడేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు విగ్రహాలు బయట నేలపై పడి ఉన్నాయి. గుడి ముందు పూజా సామగ్రి చిందరవందరగా పడి ఉంది. ఆదివాసీల ఆరాధ్య దేవతలైన సమ్మక్క-సారక్క గుడిని ఇలా ధ్వంసం చేయడంపై గ్రామస్తులు, భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, గుడిని మళ్లీ బాగు చేయాలని వారు కోరుతున్నారు.



భవన నిర్మాణ కార్మికుల ఆందోళనకు తరలిరండి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు...

మహబూబాబాద్, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : అక్టోబర్ 26న హైదరాబాదులో జరిగే భవన నిర్మాణ కార్మికుల ఆందోళనకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాదులో జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం గార్ల పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు కేటాయించిన వెల్ఫేర్ బోర్డ్ నిధులను వారికి మాత్రమే కేటాయించాలని దారి మళ్లించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోర్టులను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా, మండల అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్, అంబటి వీరాస్వామి,భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల నాయకులు జడ శ్రీను, ఎస్.కె మౌలానా, టి.రవీందర్, సత్యం,వార్డు సభ్యులు సాయి,హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రధానం



నర్సంపేట, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : నర్సంపేట పట్టణంలో "జనతా యూత్" ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా "దేవీ నవరాత్రి ఉత్సవాలు"లో భాగంగా "ముగ్గుల పోటీ, వెల్ బేబీ షో, మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు" నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల చివరి రోజు అయిన బుధవారం రోజు పోటీలలో గెలుపొందిన బాలలు, మహిళలకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్వయంకృషి సంస్థ నిర్వాహకు లు "బెజ్జంకి ప్రభాకర్" పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కార్యక్ర మాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బాలలలో, మహిళలలో భక్తి భావం పెంపొందించే వారిలో దాగి ఉన్న ప్రతిభా పాటవలు వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం నిర్వహి స్తున్న "జనతా యూత్" నిర్వాహకులను అభినందిస్తున్నట్లు తెలియజేశారు. నేటి యువత ఇలాంటి సామాజిక హిత, సామాజిక స్నేహ కార్యక్రమాలు నిర్వహించడం వలన యువత చెడు మార్గాలు విడనాడి మంచి మార్గంలో పయనించే అవకాశాలు ఎక్కువగా ఉండి ఒక నూత న సమాజ నిర్మాణానికి నాంది పలుకుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనతా యూత్ నిర్వాహకులు శ్రీరామోజు మురళి, 20వ వార్డ్ కౌన్సిలర్ శ్రీరామోజు రోజారాణి, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, జనతా యూత్ సభ్యులు, బాలలు, మహిళలు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ప్రాచీనకోనేరులో త్రిశూలస్నానార్చన



హనుమకొండ, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : విజయదశమి దసరా పండుగ సందర్భంగా చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం రుద్రేశ్వరీదేవిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. హంస వాహన సేవలో రుద్రేశ్వరీదేవిని కోనేరు వరకు వాహనసేవ నిర్వహించారు. అమ్మవారిని కోనేరులో వేదమంత్రాల మధ్య త్రిశూల స్నానార్చనను వైభవంగా జరిపించారు. అమ్మ చల్లనిచూపు అందరిపై ఉండాలని కోనేరు జలాలను భక్తులపై చల్లి ఆశీర్వదించారు. అనంతరం సాయంత్రం భక్తులకు చిత్రాన్న ప్రసాద వితరణ, జమ్మివృక్ష పత్రాలు భక్తులకు అందజేశారు. త్రిశూల స్థానార్చనలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు పల్లం రమేష్, కోన శ్రీకర్, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, దత్తకుమార్‌శర్మ, ప్రణవ్ త్రిశూల స్థానార్చన వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి

ఎర్రబెల్లి ప్రదీప్ రావు



మట్టెవాడ, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : వరంగల్ తూర్పు నియోజవర్గంలోని పోచమ్మ మైదాన్ కూడలిలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న సుమారు 17,000 మంది ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎర్రబెల్లి కోరారు. ఉద్యోగులు తమ హక్కుల కోసం నిరవధిక సమ్మెకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని ఆయన అన్నారు. 17,000 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రిజర్వాయర్‌లా రామప్ప సరస్సు...

గోదావరి జలాలు నిత్యం రామప్పలోకి తరలింపు...

ఏల్నినో పట్ల అప్రమత్తత అవసరం..

రామప్ప తూము, ఫిల్టర్ బెడ్ పరిశీలించిన మంత్రి సీతక్క..



ఫిల్టర్ బెడ్ వద్ద శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్ అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : నిత్యం గోదావరి జలాలతో రైతులకు, సాగునీటి కష్టాలు లేకుండా, నాలుగు మండలాల ప్రజలకు త్రాగు నీటి కష్టాలు లేకుండా చేసి, వారి పొలాలను సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇప్పటికే ఈ దిశగా అవసరమైన చర్య లు చేపట్టి, రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభా వంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో,రామప్ప జలాశయంలో అందుబాటులో ఉన్న నీటిని సాగునీటి అవసరాలకు (ఖరీఫ్ పంట) మళ్లించేం దుకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. ఎల్‌నినో పట్ల రైతుల అప్రమత్తత అవసరమన్నారు. యాసింగి పంట వేయకపోవడమే మంచిది అన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి, వారికి సాగునీరు అందేలా కృషి చేసేబాధ్యత నాది అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమకు నిజమైన సంతృప్తినిస్తుందని తెలిపారు. రామప్ప జలాశయంలోకి గోదావరి జలాలను తరలించే లక్ష్యంతో ముందుకు సాగుతూ, రాబోయే సంవత్సరంలో రైతులకు సాగునీటి కష్టాలు తగ్గించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. వెంకటాపూర్ మండ లంతో పాటు నాలుగు మండలాలకు అవసరమైన తాగునీటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వడం తమ ప్రధాన లక్ష్యం అని అన్నారు. అనంతరం ఫిల్టర్ బెడ్ సందర్శించి 8 పంపుల ద్వారా శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. వారి వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మల్లాడి రామ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్, పాలంపేట సర్పంచ్ చల్లగొండ రాజు, ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ భాష బోయిన పోశాలు, కేశవాపూర్ సర్పంచ్ తోట భద్రయ్య, నాయకులు చెన్నోజు సూర్యనారాయణ, వకులాబరం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బెండకాయ జిగురు మంచిదేనా?

జీర్ణక్రియ, కొలెస్ట్రాల్‌పై కీలక విషయాలు!

హనుమకొండ, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : భారతీయ వంటగదుల్లో బెండకాయకు ప్రత్యేక స్థానం ఉంది. బెండకాయ వేపుడు నుంచి కూరల వరకు అనేక రకాలుగా దీనిని వండుకుని తింటారు. రుచితోపాటు వివిధ వంటకాల్లో ఉపయోగించుకునే వీలుండడంతో చాలామంది బెండకాయను ఇష్టపడతారు. అయితే, బెండకాయలో ఉండే జిగురు స్వభావం కొందరికి నచ్చదు. ఆ జిగురును తొలగించేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, అదే జిగురు ఆరోగ్యానికి కొన్ని ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. బెండకాయలో నీటితో కలిసినప్పుడు జెల్ తరహా పదార్థంగా మారే కరిగే పీచు పదార్థం ఉంటుంది. దీనిని మ్యూసిలేజ్ అంటారు. బెండకాయ జిగురుగా ఉండడానికి ఇదే కారణం. ఈ రకమైన పీచు పదార్థం జీర్ణక్రియకు, ప్రేగుల కదలికలు సక్రమంగా సాగడానికి సహాయపడుతుంది. అలాగే పేగుల్లోని సూక్ష్మ జీవుల ఆరోగ్యాన్ని కాపాడడంలో, కొలెస్ట్రాల్ నియంత్రణలోనూ కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. అందువల్ల బెండకాయ కేవలం సాధారణ కూరగాయ మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా ఉపయోగపడుతుంది.

జీర్ణక్రియ, కొలెస్ట్రాల్ నిర్వహణకు దోహదం..

ఎయిమ్స్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల్లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి బెండకాయలోని జిగురు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టును పంచుకున్నారు. బెండకాయ జిగురు జీర్ణక్రియకు, కొలెస్ట్రాల్ నిర్వహణకు ఏ విధంగా తోడ్పడుతుందో ఆయన వివరించారు. డాక్టర్ సౌరభ్ సేథి వివరాల ప్రకారం, బెండకాయలోని మ్యూసిలేజ్‌లో కరిగే పీచు పదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియ సక్రమంగా సాగడానికి, ప్రేగుల కదలికలు క్రమబద్ధంగా ఉండడానికి సహాయపడుతుంది. పీచు పదార్థం మలానికి తగిన పరిమాణాన్ని అందించి, జీర్ణవ్యవస్థలో అది ముందుకు కదలడానికి తోడ్పడుతుంది. తగినంత పీచు పదార్థం తీసుకోవడం వల్ల మలబద్ధకం సమస్యను నివారించడంలోనూ ప్రయోజనం ఉంటుంది. మన జీర్ణవ్యవస్థలో నివసించే వివిధ రకాల సూక్ష్మజీవుల సముదాయాన్ని గట్ మైక్రోబయోమ్ అంటారు. వీటిలో కొన్ని సూక్ష్మజీవులు ఆహారం ద్వారా లభించే పీచు పదార్థాన్ని వినియోగించుకుంటాయి. పీచు పదార్థం సమృద్ధిగా ఉండే బెండకాయ వంటి ఆహారాలను సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.


ఘనంగా ముగిసిన భద్రకాళి శరన్నవరాత్రోత్సవాలు

వైభవంగా శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం

మట్టెవాడ, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు విజయ దశమితో ముగిశాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వర్తించి కలశోద్వాసన జరిపి అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపిన పిమ్మట చక్ర తీర్థోత్సవం (చక్రస్నానం) ధ్వజారోహణం జరిపారు. దాదాపు అరవై వేల మంది ఈ విజయ దశమి రోజున అమ్మవారిని దర్శించుకున్నారు. శమీ వృక్షానికి పూజ చేసి శమీ పత్రాలను (జమ్మి ఆకులను) భక్తులు పరస్పరం పంచుకున్నారు. ఈరోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, పోలీస్ కమీషనర్ శ్వేతా రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం తదితరులు ఉన్నారు. మంగళవారం ఉభయదాతలుగా రత్న హటరీటల్ అధినేతలు పింగిళి సంపత్ రెడ్డి-సునీత దంపతులు వ్యవహరించారు. బుధవారం మధ్యాహ్నం



అమ్మవారికి శతఘటాభిషేకం నిర్వహించారు. తదుపరి సాయంకాలం 7-30 గంటలకు దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో జరిగిన శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణం అనంతరం భగవత్ప్రసాదంగా హాజరైన భక్తులకు శ్రీ భద్రకాళీ భక్త సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కళ్యాణం రోజు ఉభయ





దాతలుగా మంచాల శ్రీకాంత్- కవిత దంపతులు, మంచాల నవీన్- స్వప్న దంపతులు, యాదా కిషన్- శోభ, రేగూరి ఆంజనేయులు-సరళ దంపతులు వ్యవహరించారు. దేవీ శరన్నవరాత్రుల లో పది రోజులుగా అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ భక్తసేవా సమితి ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ అశేష అన్నదానములు భక్తుల ప్రశంసలు పొందాయి. ఉత్సవాలలో సహకరించిన అధికార అనధికార ప్రముఖులకు ముఖ్యంగా పోలీసు సిబ్బందికి, మీడియా ప్రతినిధులు జరిపిన సేవలపట్ల దేవాలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు వేణుగోపాల్, కల్లూరి పవన్, కటకం రాములు, కారెంగుల సురేష్, శ్రవణ్ కుమార్ రెడ్డి, అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్ చంద్ భంగ్, వాసవి రెడ్డి, మయూరి, ఎక్స్ అఫీషియో మెంబర్ పార్నంది నర్సింహమూర్తిలు కార్యనిర్వహణాధికారి రామల సునీతలు ధన్యవాదాలు సమర్పించారు.



అనితారెడ్డికి శ్రీ దుర్గాదేవి

సేవా పురస్కార్

మట్టెవాడ, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ): ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ హైదరాబాద్ వారు అనురాగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురా లు డాక్టర్ కె.అనితా రెడ్డికి విజయదశమి నవరాత్రులను పురస్కరించుకొని మన సంస్కృతి సంప్రదాయాల పట్ల, ప్రకృతి పరిరక్షణ పట్ల ప్రజలకు ము ఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే కాక అనితారెడ్డి సమాజానికి అనాథలకు, దివ్యాంగులకి, మహిళలకు, వృద్ధులకు, నిస్వార్థంగా అందిస్తున్న సేవలను గుర్తించి శ్రీ దుర్గాదేవి సేవా పురస్కార్ -- 2026." అవార్డు ను అందించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ మహిళా సాధికారతకు మన సంస్కృతి సంప్రదాయాలను వాటి విశిష్టతను తాను పాటిస్తూ మరో తరాలకు నేర్పిస్తూ స్ఫూర్తిగా నిలిచే మహిళా నాయకురాలికి ఇచ్చే అవార్డు ఇది అని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితారెడ్డి మాటాడుతూ అవార్డులు ఆనందాన్ని ఇవ్వడం కాదు సమాజం కోసం ఇంకా ఎక్కువ చేయాలనే బాధ్యతను పెంచాయని మరిన్ని సమాజహితం కోరట్ట కార్యక్రమాలు నిర్వహిస్తానని, అవసరార్థులకు అండగా నిలుస్తానని తెలిపారు.

రైతు రుణాలను మాఫీ చేయాలి


ఎలుకటి రాజయ్య మాదిగ

చిట్యాల, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఎల్‌నినో ప్రభావంతో సక్రమంగా వర్షాలు కురువక నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో ఈ సంవత్సరం రైతులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఈ వానకాలంలో వర్షాలు కురువక పోవడంతో సాగు తాగు నీటి ఇబ్బందులు ప్రజలకు తప్పడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వానాకాలం పంటల వరకు రైతులు తీసుకున్న రుణాలను వడ్డీతో సహా మాఫీ చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తక్షణమే క్యాబినెట్ బేటి నిర్వహించి రైతు రుణాలను మాఫీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి!

బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కళ్యాణికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు



మణుగూరు, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : బూర్గంపాడు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తోలెం కళ్యాణి బుధవారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ తోలెం కళ్యాణికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తోలెం కళ్యాణి సైతం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం కావాలి!

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన చైర్మన్ తోలెం కళ్యాణికి అభినందనలు తెలియజేస్తూ, బూర్గంపాడు మార్కెట్ కమిటీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారి అవసరాలను గుర్తించి తగిన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు మార్కెట్ కమిటీలు ఎంతో కీలకమని, రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, మార్కెట్ కమిటీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా వారికి మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొత్త బాధ్యతలతో మరింత సేవ చేయాలి!

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తోలెం కళ్యాణి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా మార్కెట్ కమిటీపై మరింత విశ్వాసం పెంపొందించాలని సూచించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేయడంతో అక్కడి నాయకులు, కార్యకర్తల్లో హర్షం వ్యక్తమైంది. ఈ మర్యాదపూర్వక భేటీతో నూతన బాధ్యతల నిర్వహణకు శుభాకాంక్షలు తెలపడం తో పాటు, రైతుల సంక్షేమం మరియు మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, తోలెం మల్లేష్, తాల్ల గుట్టయ్య, మాజీ ఎంపీపీ పడిగ నాగయ్య, తోలెం క్రిష్ణ, షేక్ మధార్, పడిగ వీరబాబు, కొమరం శ్రీను, తోలెం అర్జున్, బడే వెంకటేశ్వర్లు, తోలెం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జనసందోహం నడుమ దసరా వైభవం..

ఇల్లెందు వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లెందులో మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన దసరా వేడుకలు వైభవంగా సాగాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇల్లెందులో దసరా వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ వేలాదిమంది పాల్గొనడం అభినందనీయమని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో భాగస్వాములు కావడం పండుగ ప్రత్యేకతను చాటుతోందన్నారు. కళాకారుల ఆటపాటలు, ప్రదర్శనలు, వారి ఉత్సాహం చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తోందని కొనియాడారు.

ధర్మానికి విజయదశమి ప్రతీక

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్వదినం సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలనే సందేశాన్ని అందిస్తుందన్నారు. పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంతోపాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, కళాకారులు, పట్టణ ప్రజలు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల ముందుచూపుకి హాట్సాఫ్!

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోలేటి భవాని శంకర్



పినపాక, అక్టోబర్ 20 (పైపుప్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, అశ్వాపురం మండలంలోని కుమ్మరిగూడెం వద్ద గోదావరిపై ఉన్న ఆనకట్ట నుండి మూడు జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందిస్తున్నారు.ఆ ఆనకట్టపై ఒక మీటరు ఎత్తులో ఇసుక బస్తాలు వేసి, ఒక టీఎంసీ నీరు నిల్వ ఉండే విధంగా రూపకల్పన చేసి, ముఖ్యమంత్రి ని స్వయంగా కలిసి విన్నవించి ఆమోదం పొంది, తదుపరి ఆనకట్టను సందర్శించి అధికారులకు ఆదేశాలు చేసి, భవిష్యత్తులో సాగునీటికి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో ఆలోచించిన అభివృద్ధి ప్రదాత, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, తుమ్మల వీరాభిమాని కోలేటి భవాని శంకర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భం గా కోలేటి భవాని శంకర్ మాట్లాడుతూ, గతంలో వేసవికాలంలో గోదావరిలో నీటి మట్టం తగ్గి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవని, ఎల్నీనో ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా మంత్రి తుమ్మల ఈ వినూత్న ఆలోచన చేశారని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడం లో ఈ నిర్ణయం కీలకంగా మారనుందన్నారు.తాగునీటి అవసరాలతో పాటు, రైతుల సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, తుమ్మల నాగేశ్వరావు అనుభవానికి, ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. మూడు జిల్లాల ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరావు కే దక్కుతుందని, ఇది చరిత్రలో నిలిచి పోయే నిర్ణయమని అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పుడూ అభివృద్ధి, సంక్షే మమే ధ్యేయంగా పనిచేస్తారని, పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కోలేటి భవాని శంకర్ పేర్కొన్నారు.

వైభవంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయుధ పూజ

ఖమ్మం, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : దేవి నవరాత్రుల వేడుకలను పురస్కరించుకుని, కొత్తగూడెం ఖమ్మం పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మేక పోతును చాగంటి వెంకటేశ్వర్లు వదించారు. ?విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, లోకకళ్యాణం కోసం ప్రార్థించారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ ఆయుధ పూజ కార్యక్రమంలో సంఘం నాయకులు సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ముదిరాజ్ సంఘం నాయకులు పగడాల మల్లేష్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల వెంకట నర్సయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు మాట్లాడుతూ... నవరాత్రులు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను, ఐశ్వర్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు సమాజంలో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందించడం లో ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అక్కి కోటయ్య, గోల్కొండ అంజయ్య, పర్వత వెంకటేశ్వర్లు, హైస్కూల్ శ్రీనివాస్, మరకల రమేష్, చెన్నబోయిన వెంకటేశ్వర్లు, పోతుల నర్సింహారావు, కనకయ్య, కొత్తగూడెం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బుడి వెంకన్న, కార్యదర్శి రావుల సంజీవరావు, ముదిరాజ్ సంఘం నాయకులు నాగటి శేషయ్య, శీతల చిన్న లక్ష్మయ్య, మాకనబోయిన నాగేశ్వరరావు, గొడుగు రాము, పర్వత సైదులు, లింగనబోయిన, రాములు, ప్రతానపు రామనాధం, చాగంటి వెంకట నర్సయ్య, పిట్టల పెద్ద తిరుమలు, దంతాల పుల్లయ్య, పర్వత పుల్లయ్య, ముద్రబోయిన అప్పారావు, పర్వత పెద్ద శంకర్, పోతురాజు వెంకటేశ్వర్లు, పగడాల శ్రీను, తోట రవి తదితరులు పాల్గొన్నారు.





టాలీవుడ్‌లో ఏడాదికి ఐదు హిట్స్ మాత్రమే వస్తున్నాయా?



(హైదరాబాద్, పీపుల్స్ డైరీ) : తెలుగు సినిమా ఇండస్ట్రీ పాన్ ఇండియా బాట పట్టింది. ప్రతి ఒక్కరు సక్సెస్‌లను సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. నిజానికి ఒక సంవత్సరంలో వంద సినిమాలు రిలీజ్ అయితే కేవలం 5 సినిమాలు మాత్రమే సక్సెస్‌లను సాధిస్తున్నాయి. తెలుగు సినిమాలు వందల వేల కోట్ల కలెక్షన్స్‌ను రాబడుతున్నాయి. మా మూవీ మొదటి రోజు భారీ రికార్డులను కొల్లగొట్టింది అంటూ ప్రొడ్యూసర్లు భారీ ఎత్తున పోస్టర్లు వేస్తున్నారు. రికార్డ్ బ్రేక్ అయింది అంటూ వాళ్ళు వేసే పోస్టర్ల వెనుక ఎంతవరకు నిజం ఉంది? కేవలం ప్రేక్షకుడిని థియేటర్‌కి రప్పించడానికి ఈ పోస్టర్లను వాడుతున్నారా? లేదంటే జెన్యూన్‌గానే పోస్టర్లను వేస్తున్నారా? సినిమా ఇండస్ట్రీలో ప్రొడ్యూసర్‌కి ఎంతవరకు లాభాలు వస్తున్నాయి? కమర్షియల్ సక్సెస్ లను సాధించిన సినిమాలు ఎన్ని? అనే విషయాలను మనం కులంకషగా చర్చించుకుందాం.

హిట్టు, ఫ్లాప్ ఏదైనా ప్రొడ్యూసర్ సేఫేనా..?

ఒక సినిమా సక్సెస్ అయితే ప్రొడ్యూసర్స్ లాభాల బాట పడుతున్నారు. సినిమా ఫ్లాప్ అయినప్పటికి ఆయన సేఫ్ జోన్‌లోనే ఉంటున్నాడు. కారణమేంటంటే ప్రొడ్యూసర్ ఒక సినిమాకి 30 కోట్ల వరకు బడ్జెట్ పెడితే అతనికి సినిమా రిలీజ్‌కి ముందే ఓటిటి రైట్స్, శాటిలైట్ రైట్స్, మ్యూజిక్ రైట్స్, హిందీ డబ్బింగ్ రైట్స్, ఓవర్సీస్ రైట్స్ పేరుతో వాళ్లకు రావాల్సిన డబ్బులు ముందుగానే వస్తున్నాయి. దీనివల్ల సినిమా అమ్మిన ప్రొడ్యూసర్ సేఫ్ గానే ఉంటున్నాడు. కానీ దాన్ని కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్లు వాటిని థియేటర్లలో ప్లే చేస్తున్న ఎగ్జిబ్యూటర్లు మాత్రం సినిమా ఆడకపోతే విపరీతమై న నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల ప్రొడ్యూసర్స్ భారీ బడ్జెట్‌తో సినిమాలు చేస్తున్నారు. కానీ దాని నష్టాన్ని డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లు భరించాల్సిన అవసరమైతే వస్తుంది... ఒక సినిమాకి లాభాలు వస్తే అందరూ మరో సినిమా చేయడానికి ముందుకు వస్తారు. కానీ నష్టం వచ్చినప్పుడు దానిని ఎవరు భరించాలి. వందల కోట్లు పెట్టి సినిమాలను తీసిన ప్రొడ్యూసర్లు సినిమాని అమ్ముకొని సేఫ్ జోన్ లో ఉంటున్నారు. సినిమాలు రిలీజ్ అయిన తర్వాత డిస్ట్రిబ్యూటర్లు ఎగ్జిబ్యూటర్లు మీద ఈ నష్టం పడుతుంది...

కొత్త నిర్మాతల రాక

ఒకప్పటితో పోలిస్తే సినిమా ఇండస్ట్రీలో చాలా తక్కువ మంది ప్రొడ్యూసర్లు ఎక్కువ సినిమాలను ప్రొడ్యూస్ చేయగలుగుతున్నారు. ఒకప్పుడు టాప్ ప్రొడ్యూసర్ అంటే దాదాపు 50 నుంచి 100 సినిమాల వరకు ప్రొడ్యూస్ చేశారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు ఒక సినిమాతో ప్రొడ్యూసర్‌గా మారిన వ్యక్తి ఆ సినిమా అనుకున్న విజయాన్ని సాధిస్తే మరికొన్ని సినిమాలు చేయగలుగుతున్నాడు. ఒకవేళ భారీ బడ్జెట్ సినిమా తీసినప్పుడు దానివల్ల తీవ్రమైన నష్టాలను చవిచూడటమే కాకుండా మరో సినిమాను చేయడానికి సైతం అతను ముందుకు రావడం లేదు. ఎందుకంటే అతనికి ముందు చేసిన సినిమా వల్ల భారీ నష్టం ఏర్పడుతుంది. దానివల్ల ఫైనాన్స్‌లు కట్టలేక, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారు. ఇంకో మూవీ చేసి ఆ నష్టాన్ని భర్తీ చేద్దాం అనుకున్నప్పటికి వర్కౌట్ కావడం లేదు. ఈ లోపు తనకి ఎదురయ్యే ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆయన ఇండస్ట్రీ నుంచి దూరమవుతున్నాడు... కొత్త ప్రొడ్యూసర్స్ సినిమా ఇండస్ట్రీ మీద ఇంట్రెస్ట్‌తో స్టార్ హీరోలతో కలిసి పనిచేయవచ్చనే ఉత్సాహంతో కొంతమంది బిజినెస్ మెన్స్ ప్రొడ్యూసర్స్‌గా మారుతున్నారు. పాత ప్రొడ్యూసర్స్ నష్టాలను చవిచూస్తుంటే కొత్త ప్రొడ్యూసర్స్ వచ్చి మూవీస్ చేస్తున్నారు. వాళ్ళు కూడా ఒకటి రెండు సినిమాలతో నష్టం వస్తే ఇండస్ట్రీ నుంచి వెళ్ళిపోతున్నారు మళ్ళీ కొత్త వాళ్ళు వస్తున్నారు. ఇదంతా ఒక లూప్ లాగా జరుగుతుంది... నిజానికి ప్రొడ్యూసర్స్ అందరూ నష్టాల్లోనే ఉన్నారా అంటే కొంతమంది ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు వాళ్ళకి మంచి విజయాలే దక్కుతున్నాయి. తద్వారా వాళ్ళు సక్సెస్ లోనే ఉంటున్నారు. ఎంతమంది కొత్త ప్రొడ్యూసర్స్ వచ్చిన పాట ప్రొడ్యూసర్ ను కాదుకున్నప్పుడే ఇండస్ట్రీ లో మంచి సినిమాలు రావడానికి ఇంకా ఎక్కువ మంది ప్రొడక్షన్ రంగంలోకి రావడానికి అవకాశం ఉంటుంది.

బడ్జెట్ తగ్గిస్తే బాగుంటుందా?

ఒక హీరో మార్కెట్‌కి మించి బడ్జెట్ పెట్టడం వల్ల మూవీ సక్సెస్ అయితే లాభాలు వస్తున్నాయి. కానీ ఫ్లాప్ అయినప్పుడు ఎగ్జిబ్యూటర్స్ దగ్గరి నుంచి ప్రొడ్యూసర్ వరకు అందరు నష్టపోతున్నారు. నిజానికి హీరో మార్కెట్ ఎంత? సినిమా కంటెంట్ ప్రకారం ఈ మూవీని ఎంతలో చేయచ్చు అనే విషయాల మీద క్లారిటీగా ఉంటే బాగుంటుంది. బడ్జెట్ పెరగడానికి ముఖ్య కారణం హీరో

మరి ఇండస్ట్రీ పరిస్థితేంటి.?

రెమ్యూనరేషన్స్... ప్రస్తుతం మన స్టార్ హీరోలు వందల కోట్ల రెమ్యూనరేషన్స్ ఛార్జ్ చేస్తున్నారు. దీనివల్ల సినిమా హిట్ అయిన ఫ్లాప్ అయిన వాళ్ళకి రావల్సిన రెమ్యూనరేషన్ వాళ్ళకి వచ్చేస్తున్నాయి. దర్శకుల పారితోషికాలు కూడా పెద్ద మొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రొడ్యూసర్ మాత్రం సినిమా ఫ్లాప్ లో నష్టాలను భరించాల్సి వస్తుంది. అలాగే సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి పెద్ద మొత్తం లో ప్రమోషన్స్ చేయాల్సిన అవసరమైతే ఉంది. ప్రచార ఖర్చులకు కొన్ని కోట్లల్లో వెచ్చించాల్సి ఉంటుంది...హీరోలు ఎక్కువ రెమ్యూనరేషన్ ఎందుకు తీసుకుంటున్నారు తగ్గించుకోవచ్చు కదా అంటే మాకు క్రేజ్ ఉంది కాబట్టి మేము తీసుకుంటున్నాం. ఒకవేళ వరుసగా మా రెండు సినిమాలు ఫ్లాప్ అయితే ప్రొడ్యూసర్స్ మా దగ్గరికి వస్తారా రారు కదా! మేము అడిగినంత ఇస్తారా లేదు కదా! అందుకే సక్సెస్ లో ఉన్నప్పుడే మేము డిమాండ్ చేస్తున్నాం అంటూ హీరోల వైపు నుంచి కొన్ని కామెంట్స్ వస్తున్నాయి... వాళ్ళు చెప్పే మాటల్లో తప్పులేదు. కానీ సినిమా ప్రొడ్యూసర్స్ నష్టాల్లో ఉన్నప్పుడు కొంచెం రెమ్యూనరేషన్స్ తగ్గించుకొని కావాలంటే సినిమా సూపర్ హిట్ అయిన తర్వాత ఇంకా కొన్ని డబ్బులు తీసుకుంటే బాగుంటుంది...గతంలో కొన్ని సినిమాలు డిజాస్టర్లు అయినప్పుడు రెమ్యూనరేషన్స్ వెనక్కి ఇచ్చేసిన హీరోలు కూడా ఉన్నారు... 100 కోట్ల సినిమాకి 200 కోట్ల కలెక్షన్స్ వస్తే ప్రొడ్యూసర్స్‌కి ఎంత లాభమస్తుంది థియేటర్లు వసూలు చేసే గ్రాస్ కలెక్షన్స్ మొత్తం ప్రొడ్యూసర్‌కి రావు. థియేటర్ మెయింటెనెన్స్ ఖర్చులు, టాక్స్ లు, వివిధ ఖర్చులు పోను మిగిలినవి మాత్రమే ప్రొడ్యూసర్ కి వస్తాయి... నిజానికి ఓటిటి లు వచ్చి ప్రొడ్యూసర్స్ మీద కొంతవరకు భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి... ఉదాహరణకు ఒక మూవీ బడ్జెట్ 100 కోట్లయింది అనుకుంటే ఆ మూవీ రిలీజ్ కి ముందే ప్రీ రిలీజ్ బిజినెస్ ద్వారా ఒక 70 కోట్ల బిజినెస్ జరిగినట్లయితే సినిమా థియేటర్ లో 60 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టిన అన్ని పోను ప్రొడ్యూసర్ కి 30 కోట షేర్ వస్తుంది. పెట్టిన పెట్టుబడి తనకి వచ్చేస్తుంది. అలాంటప్పుడు నష్టం ఉండదు. 200 కోట్ల కలెక్షన్స్‌ను సంపాదించినప్పుడు ప్రొడ్యూసర్‌కి అందులో 100 కోట షేర్ వస్తుంది. అలాగే సినిమాను 70 కోట్లకు అమ్మారు. ఇక మొత్తం 170 కోట్లు వచ్చింది. అందులో 100 బడ్జెట్ పోతే 70 కోట్ల వరకు లాభం వచ్చే అవకాశం ఉంది... ఇలా కాకుండా ఏరియా వైజ్ డిస్ట్రిబ్యూటర్లకు రైట్స్ అమ్మేసి ఉంటే ఆ ఏరియాలో వచ్చే లాభనష్టాలు డిస్ట్రిబ్యూటర్స్ భరించు కోవాల్సి ఉంటుంది... ఓటిటి లేకపోతే ప్రొడ్యూసర్స్ పరిస్థితేంటి? ఓటిటి లు ప్రొడ్యూసర్స్ కి కొంచెం అండగా నిలబడుతున్నప్పటికీ వాళ్ళు సైతం హీరో మార్కెట్ కంటెంట్ విషయంలో కేర్‌ఫుల్‌గా వ్యవహరిస్తున్నారు. ఓటిటి లో వ్యూయర్ షిప్ ఉన్న సినిమాల ద్వారానే వాళ్ళకి డబ్బులు వస్తాయి. అలాగే ఒక సూపర్ హిట్ మూవీ ఓటిటి లోకి వచ్చిందంటే దాన్ని చూడటానికి ఓటిటి సబ్స్క్రిప్షన్స్ పెరిగేలా ఉండాలి. ప్రొడ్యూసర్స్ వాళ్ళకి వచ్చే రాబడిలో థియేటర్ తో పాటు శాటిలైట్, ఓటిటి రైట్స్ ను కూడా లెక్కలోకి వేసుకుంటున్నారు. ఒకవేళ ఓటిటి లు చేతులెత్తేస్తే ప్రొడ్యూసర్స్ పరిస్థితి ఏంటి? వాళ్ల సినిమాలు సక్సెస్ అయితే పర్లేదు కానీ ఫ్లాప్ అయితే మరింత ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది...

జనాలను థియేటర్‌కి రప్పించడం ఎలా?

ప్రస్తుత కాలంలో సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ప్రేక్షకులు థియేటర్‌కి రావడం లేదు. స్టార్ హీరోల సినిమాలకు సైతం మొదటి వారం రోజులు మినహాయిస్తే ఆ తర్వాత జనాలు పెద్దగా కనిపించడం లేదు. ఇక చిన్న సినిమాల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. ఆ సినిమాలు రిలీజై సక్సెస్ సాధించిన కూడా వారం రోజులు పోతే ఓటిటిలో వస్తుంది కదా అప్పుడు చూద్దాంలే అనే దోరణిలో ప్రేక్షకులు ఆలోచిస్తున్నారు. ఇక దీనికి తోడు ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు ప్రేక్షకుడి ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించే ప్లాట్ ఫామ్ లు ఎక్కువైపోయాయి. ఫోన్‌లో ఒక నిమిషం వీడియోస్ చూస్తూ ఎంటర్ టైన్ చేసేవాళ్ళు థియేటర్‌లో మూడు గంటల సినిమా చూడటానికి ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపించడం లేదు...దానితోడు టికెట్ రేట్లను పెంచుతున్నారు. బ్రేక్ టైం లో తిందాం అంటే స్నాక్స్, కూల్ డ్రింక్స్ రేట్ విపరీతంగా పెంచేస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకులు థియేటర్‌కి రావడం లేదు. అందువల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లను నడిపించడం కష్టమవుతుంది. ఆ కారణంతోనే చాలా థియేటర్లు మూతబడుతున్నాయి... వీటన్నింటికి చెక్ పెడితే జనాలు థియేటర్లకు వచ్చే అవకాశం ఉంది... ప్రతి సంవత్సరం 100 సినిమాలు రిలీజైతే అందులో 5 సినిమాలు హిట్టై 300 కోట్ల ఆదాయాన్ని తీసుకువచ్చాయి. మిగిలిన 95 సినిమాలు 425 కోట్ల కలెక్షన్స్ ను తీసుకువచ్చాయి అనుకుందాం మొత్తం 100 సినిమాల మీద 1000 కోట్లు పెడితే 725 కోట్ల ఆదాయం వచ్చింది. మిగిలిన 275 కోట్ల నష్టం వచ్చింది. ప్రస్తుతం ఇండస్ట్రీ లో జరుగుతున్న పరిస్థితులను బట్టి అంచనా వేసి చెప్పాం... కొన్ని సక్సెస్ ఫుల్ సినిమాలు వచ్చి ఈ లెక్కలన్నింటినీ మార్చవచ్చు. కానీ ఎక్కువ మొత్తం లో సంవత్సరం చివరలో లెక్కలను బయటికి తీస్తే మాత్రం చాలా మంది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లు నష్టపోతున్నారు...

ప్రజల భద్రతకై

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

భూపాలపల్లిలో ఘనంగా పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం - అమరవీరులకు ఘన నివాళులు..

భూపాలపల్లి, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్మృతి పరేడ్ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీస్ అమర వీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి, పుష్పాంజలి ఘటించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోలీసుల సేవలు సమాజానికి ఎంతో కీలకం - కలెక్టర్ రాహుల్ శర్మ

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గారు మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని అన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని







పేర్కొన్నారు.

ప్రజల భద్రత కోసం పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది

కార్యక్రమానికి హాజరైన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



నవంబర్ 19న బతుకమ్మ చీరల పంపిణీ..?

చిట్యాల, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ ఆడబిడ్డలు గొప్పగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ. ఈ పండుగను మహిళలు ఆత్మగౌరవంతో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చీరలను పంపిణీ చేయాల్సి ఉండగా అది జరగలేదు. వచ్చేనెల అనగా నవంబర్ 19 న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బతుకమ్మ చీరల పంపిణీ ఉండనున్నట్లు తెలుస్తుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు ప్రేమ పూర్వక చిరుకానుకను అందించే ఉద్దేశ్యంతో 2017లో అప్పటి ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలకు చేయూతను ఇచ్చేందుకోసం ఆడబిడ్డలకు ప్రేమ పూర్వక చిరుకానుకను చీరల రూపంలో అందించనుంది. ఈ నెల18 న జరిగిన బతుకమ్మ పండుగను ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బతుకమ్మ చీరల పంపిణీ కోసం ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారు. కానీ అవి నేటి వరకు అందకపోవడంతో ఆడబిడ్డలు కొంత అసహనానికి గురయ్యారు. ఇందిరమ్మ బతుకమ్మ చీరల పంపిణీ ఎప్పుడు చేస్తారని ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారు. చిలుక పచ్చ రంగులో మెరిసిపోయే దాదాపు ఒక కోటి చీరలను పంపిణీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. 25 రంగులు 20 డిజైన్లతో నూతన బతుకమ్మ చీరలు తయారు అవుతున్నాయి. రాబోతున్న పండుగలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా ఈసారి మహిళలకు కానుక ఇవ్వడానికి సిద్ధపడింది. కానీ మహిళలకు సరిపడు చీరలు రాకపోవడంతో పంపిణీ చేయలేదు. దసరా సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైన కొంత జాప్యం వలన అలాగే మహిళ లందరికీ సరిపడా చీరలు రాకపోవడంతో దీంతో అధికారులకు సరైన ఆదేశాలు లేకపోవడంతో చీరల పంపిణీ ఆగింది. అలాగే మరో కోణంలో అసలు ఈసారి బతుకమ్మ చీరలు ఆడబిడ్డలకు అందుతాయా అందదా..? అని కూడా ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గత సంవత్సరం మాదిరిగానే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి రోజు ఐనా నవంబర్ 19న పంపిణీ చేస్తారని కూడా అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈనెల అనగా అక్టోబర్ 10 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. ఆదే తేదీలో వివిధ డిజైన్లతో కోటి చీరలంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఈ చీరల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి మహిళా పొదుపు సంఘాలను భాగస్వామ్యం చేసింది రేవంత్ ప్రభుత్వం పొదుపు సంఘాల లో ఉన్న ప్రతి మహిళకు ముందుగా ప్రాధాన్యతనిస్తూ ఉచితంగా ఒకొక్క చీర రూ.800 విలువ గల రెండు చీరలు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే సిరిసిల్ల నేతన్నలకు ఈ మేరకు ఆర్డర్లు జారీ చేసిన సర్కార్ ముందుగా మొత్తం 65 లక్షల చీరల తయారీని చేయించింది. సిరిసిల్లలో ఏడాది పాటుగా ఉపాధి కల్పిస్తూ కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది. ఈ హామీ అమలులో భాగంగా ప్రస్తుతం వీరికి ఇందిరా మహిళా శక్తి పథకం కింద చీరల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. ఈ పథకం కోసం దాదాపు రూ. 300 కోట్ల కు పైగా కేటాయించి ఇందిరమ్మ చీరలను ఉత్పత్తి చేస్తుంది. ఇందిర మహిళా శక్తి పథకంతో సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కలుగుతుంది. తెలంగాణ సర్కార్ అందించే ఈ పథకం వల్ల సుమారు 5 వేల మంది కార్మికులు నెలకి 20 వేల చొప్పున సంపాదిస్తూ ఉపాధి పొందుతున్నారు. చేనేత జౌళి శాఖ ఈ చీరల ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్నారు. ఒకటి కాదు రెండు చీరలను సిద్ధం చేస్తున్న తెలంగాణ సర్కార్. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు అందించిన చీరలు నాసిరకం చీరలుగా ఉన్నాయని ఆరోపణలు వచ్చిన క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అటువంటి పరిస్థితి లేకుండా నాణ్యమైన బట్టల చీరలను నేయిస్తున్నారు. ఈసారి బతుకమ్మ పండుగకు మ హిళా సంఘాల మహిళలకు ఇచ్చే ఈ చీరల ధర ఒక్కొక్కటి రూ.800 రూపాయలుగా ఉంటుందని చెబుతున్నారు. గత ప్రభుత్వం ఒక చీర ఇస్తే ఈ ప్రభుత్వం రెండు చీరలను ఇచ్చి బతుకమ్మ పండుగ కానుక ఇస్తుందని చెబుతున్నారు. పండుగ సమీపిస్తున్న తరుణంలో ఆడ బిడ్డకు కానుకగా అందించే బతుకమ్మ చీరల కోసం ఆడబి డ్డలు ఆసక్తిగా ఎదురు చూశారు కానీ వారి ఆశ నెరవేరలేదు.



వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

చిట్యాల, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : చిట్యాల మండలంలోని నైన్ పాక గ్రామంలో గల శ్రీ రామకృష్ణ పరమహంస మందిరంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను ప్రతిష్టించి నవరాత్రులు పూజించి భక్తులు మాత మాల ధరించి ఎంతగానో భక్తిశ్రద్ధలతో నవరాత్రుల పూజించి అంగరంగ వైభవంగా బుధవారం శోభయాత్ర నిర్వహించారు. ఈ శోభ యాత్రలో గ్రామంలోని భక్తులు మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని గ్రామంలో భక్తిశ్రద్ధల తో డీజే పాటలతో కోలాటాల ఆట పాటలతో శోభయాత్రను గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే దుర్గామాతకు ప్రతిరోజు అలంకరించిన చీరలు వేలంపాటలో భక్తులు కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోశ్రీరామకృష్ణ పరమహంస భక్తబృందం, భక్తులు కోలాట బృందాలు పాల్గొన్నారు.

బీసీ కోటాలో నీలం మధుకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి మాల వంశీ కుమార్ ముదిరాజ్ విజ్ఞప్తి

గణపురం, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరం తరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడు నీలం మధు ముదిరాజ్‌కు బీసీ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన నీలం మధు వీరాభిమాని మాల వంశీ కుమార్ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం మధు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలు, బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవిని నీలం మధుకు కేటాయిస్తే బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ నెల 22న పండుగ సాయన్న జయంతిని తెలంగాణ ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని మాల వంశీ కుమార్ ముదిరాజ్ కోరారు.



ఘనంగా దసరా వేడుకలు..

వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ..

భూపాలపల్లి, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని, చెడును దూరం చేసి మంచితో స్నేహం చేయడమే దసరా పండుగ ముఖ్య ఉద్దేశమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం విజయదశమి సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ వధ, దసరా ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్‌లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ పాలకవర్గం సమక్షంలో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రపంచంలో పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు దసరా పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. జమ్మి చెట్టును పూజించడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం తెలంగాణ ప్రజల ఆచారమని పేర్కొన్నారు. తెలంగాణ



రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన పండుగల్లో దసరా ఒకటని, భూపాలపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సింగరేణి, జెన్‌కోతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో భూపాలపల్లి జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. దసరా పండుగ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. రావణ దహనం ద్వారా చెడును అంతం చేయాలనే సందేశంతో పాటు మనలోని అహంభావం, దురాశ, అసత్యం వంటి దుర్గుణాలను తొలగించుకోవాలనే నైతిక సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి మండలంలో దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, విజయాలు, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ.. ప్రకృతిని ప్రేమించడం, పుట్టిన గడ్డను గౌరవించడం తెలంగాణ ప్రజల ప్రత్యేకత అని అన్నారు. ప్రకృతితో మమేకమై పండుగలను జరుపుకోవడం మన సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళా శక్తిని గౌరవించడంతో పాటు, మహిళల అభ్యున్నతికి తోడ్పడటం, వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించడం వంటి విలువలను చాటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు పాలకవర్గం, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కరువు మండలాలుగా ప్రకటించాలి : మారపల్లి మల్లేష్



చిట్యాల, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురువక పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల టేకుమట్ల రెండు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ వర్షాలు సరిగా కురువక భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు తాగునీటి ఎద్దడి ఏర్పడిందని పంటల నష్టాలతో రైతులు అప్పుల బారాలు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చిట్యాల టేకుమట్ల రెండు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వానికి నివేదికలు పంపి రైతులను ఆదుకోవాలని అన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
గురువారం, 22 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 212

పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్మృతి పరేడ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్





ఖమ్మం, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు భరోసా, రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లోని పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, పోలీస్ కమీషనర్, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులను స్మరించుకుని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... దేశ రక్షణ కోసం లడక్ సరిహద్దు ప్రాంతంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది పోలీస్ శాఖ నిత్యం ప్రదర్శించే నిబద్ధత, త్యాగం, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రగతికి తోడుగా ప్రజలకు భరోసా, రక్షణ కల్పిస్తూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు.

మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక పోలీసింగ్

ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు సహా కొత్త తరహా నేరాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీసింగ్ విధానాలను ఆధునీకరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధనలో పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం రెండు ముఖ్యమైన విభాగాలని,



పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు.

అమరవీరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో పోరాడుతూ దేశ సరిహద్దులను కాపాడే క్రమంలో 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. చివరి శ్వాస వరకు దేశ రక్షణ కోసం పోరాడిన వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించు కుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను నియంత్రించడం వంటి బాధ్యతలను పోలీసులు నిరంతరం నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు తెలంగాణలో నక్సలిజం, తీవ్రవాద సమస్యలు తీవ్రంగా ఉండేవని, పోలీసుల నిరంతర కృషి, త్యాగాల ఫలితంగా ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లు శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నలుగురు పోలీసు సిబ్బంది తమ ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు సంబంధిత ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ డిసిపిలు కుమారస్వామి, విజయ బాబు, ఏఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు సిఐలు, ఆర్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, తదితరులున్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు సన్మానం





ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు





ఏన్కూరు, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : మండల వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు జరిగిన దసరా ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారిని మేళ తాళాలతో నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఏన్కూరు, గార్ల ఒడ్డు , నాచారం ఇమామ్ నగర్ తదితర గ్రామాలలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గార్ల ఒడ్డు దేవాలయంలో మాజీ సీఎం కేసీఆర్ బంధువులైన బోయినపల్లి కవితా రావు ప్రత్యేక పూజలు చేశారు. దసరా సందర్భంగా భక్తులు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల చివరి రోజున లడ్డు పాటలు నిర్వహించారు. లడ్డు ప్రసాదం దక్కించుకునేందుకు పలువురు భక్తులు పోటీపడ్డారు.

పట్టభద్రులకు దరఖాస్తు ఫారాల పంపిణీ



కరకగూడెం, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : కరకగూడెం మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు రావుల సోమయ్య గారి ఆధ్వర్యంలో అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రావుల సోమయ్య గారు మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని,పట్టభద్రులు తమ ఓటు హక్కును పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని,నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కొమరం సత్యనారాయణ,వట్టం సందీప్,మాజీ సర్పంచ్ ఊకె రామనాధం,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బైరిశెట్టి చిరంజీవి,ఎల్లు రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు!



కరకగూడెం అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం చిరుమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రాయణపేట గ్రామానికి చెందిన చెర్ప నితిన్ (20) విద్యుత్ షాక్‌తో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్న వయసులోనే నితిన్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదకర ఘటనపై కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నితిన్ పార్థివదేహానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. నితిన్ మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమవడం ఎంతో బాధాకరమని, ఇలాంటి విషాదకర ఘటనలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలో యువకుడిని కోల్పోవడం తీరని లోటని, ఆ బాధను మాటల్లో వర్ణించలేమని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తన ప్రగాఢ సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. నితిన్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆయనకు నివాళులర్పించిన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. యువకుడి అకాల మరణంతో రాయణపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నితిన్ మృతి పట్ల గ్రామస్తులు, బంధువులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిరుమల్ల సర్పంచ్ కొమరం సుగుణ, మాజీ ఉపసర్పంచ్ కొమరం వెంకటేశ్వర్లు, మండల నాయకులు వట్టం చొక్కయ్య, మృతుడి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొని నితిన్ పార్థివదేహానికి నివాళులర్పించారు.

గోతులు తీశారు.... పిల్లల్ని మరిచారు...!

అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆందోళన



పినపాక, అక్టోబర్ 21 (పీపుల్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని బొమ్మరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం గోతులు తవ్వి నెలలు గడుస్తున్నా పిల్లర్లు నిర్మించకపోవడంతో విద్యార్థుల ప్రాణ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాఠశాల పరిసరాల్లోనే ప్రమాదకరమైన గోతులు ఉండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు...?

ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, తాత్కాలిక పంచాయతీ భవనం పక్కపక్కనే ఉన్నాయి. దీంతో ప్రతిరోజూ చిన్నారులు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు ఆ ప్రాంతానికి రాకపోకలుసాగిస్తుంటారు. అంగన్వాడీకి వచ్చే చిన్నారులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆడుకుంటూ లేదా నడుస్తూ ప్రమాదవశాత్తు గోతుల్లో పడితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చిన్నారులకు ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ప్రమాదం జరగకముందే అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గోతుల చుట్టూ కనీస రక్షణ ఏర్పాట్లు కూడా లేకపోతే పిల్లల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీస్తున్నారు. గోతులు తవ్వి నెలలు గడుస్తున్నా పిల్లర్లు నిర్మించకపోవడం, సమస్య పరిష్కారానికి చర్యలు కనిపించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని స్థానిక సెక్రటరీ సంబంధిత మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

అధికారులు ఇప్పటికైనా స్పందించాలి...!

పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు, అప్పటివరకు గోతుల చుట్టూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. చిన్నారులు ప్రమాదాలకు గురికాకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని, సంబంధిత పంచాయతీ అధికారులు, విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బొమ్మరాజుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com